PRGI No : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

చీఫ్ ఎడిటర్ : పస్తం సైదులు, సంపుటి : 03 సంచిక - 319 పేజీలు - 08 మంగళవారం 13 అక్టోబర్ 2026

## తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నల్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక

## ఎన్నికల్లో ఓటమి భయంతోనే
# 'సర్' అమలు

● సీఎం రేవంత్‌రెడ్డి ● ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగింపుపై కేంద్రాన్ని నిలదీత




**తొలి అక్షరం/న్యూఢిల్లీ,అక్టోబర్ 12 :** ఓటమి భయంతోనే కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను అమలు చేస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఓటర్ల జాబితా నుంచి అర్హులైన వారి పేర్లను తొలగిస్తున్నారంటూ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. సోమవారం ఢిల్లీలో ఇండియా కూటమి ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో తెలంగాణ మంత్రులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన పాల్గొన్నారు.జనాభా పెరుగుతున్న సమయంలో ఓటర్ల సంఖ్య ఎలా తగ్గుతుందని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. దేశంలో ఇప్పటికే 13 కోట్ల ఓట్లు తొలగించారంటూ ఆయన ఆరోపించారు. ఓటు హక్కు ప్రతి పౌరుడికి మిగతా2లో...



## ఆరు రాష్ట్రాలకు
# కొత్త గవర్నర్లు

**నలుగురికి తొలిసారి అవకాశం.. ఇద్దరు గవర్నర్ల బదిలీ**

**నియామకాలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం**

**తొలి అక్షరం/న్యూఢిల్లీ,అక్టోబర్ 12:** దేశంలోని ఆరు రాష్ట్రాలకు కొత్త గవర్నర్లను నియమిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కీలక నిర్ణయం తీసుకున్నారు. కేరళ, తమిళనాడు, ఒడిశా, కర్ణాటక, ఉత్తరాఖండ్, సిక్కిం రాష్ట్రాలకు సంబంధించి కొత్త నియామకాలు, బదిలీలు చేపట్టారు. ఈ మేరకు రాష్ట్రపతి భవన్ అధికారిక ప్రకటన విడుదల చేసింది. కొత్త గవర్నర్లు బాధ్యతలు స్వీకరించిన తేదీ నుంచి ఈ నియామకాలు అమల్లోకి రానున్నాయి. **ఆరుగురు గవర్నర్ల వివరాలు** సిక్కిం గవర్నర్‌గా ఉన్న ఓం ప్రకాశ్ మిగతా2లో...

## పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్
# స్వర్గధామం

● రాష్ట్రాభివృద్ధిలో పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలి ● డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ● రూ.6,347 కోట్ల పెట్టుబడులు.. 18 వేల మందికి ఉపాధి అవకాశాలు




## దేశవ్యాప్తంగా 5 వేల ఆలయాల నిర్మాణానికి
# భారీ ప్రణాళిక




## ఆర్టీసీ - మెట్రో ఉమ్మడి పాస్ చార్జీలపై
# పునఃసమీక్ష

**సామాన్యులకు అందుబాటులో ఉండేలా ధరల నిర్ణయం**

**త్వరలో ఉన్నతాధికారులతో సమావేశం: మంత్రి పొన్నం ప్రభాకర్**



**తొలి అక్షరం/హైదరాబాద్:అక్టోబర్ 12 :** హైదరాబాద్‌లో ప్రయాణికులకు ఆర్టీసీ, మెట్రో సేవలను కలిపి అందించే ఉమ్మడి పాస్ చార్జీలను తెలంగాణ ప్రభుత్వం పునఃసమీక్షించనుంది. ప్రస్తుత ధరలు సామాన్యులకు భారంగా ఉన్నాయంటూ ఫిర్యాదులు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రయాణికులకు అందుబాటులో ఉండేలా చార్జీలను సవరించే అంశాన్ని పరిశీలిస్తామని వెల్లడించారు. **రోజువారీ పాస్ రూ.400.. నెలవారీ పాస్ రూ.8,500** ప్రస్తుతం ఆర్టీసీమెట్రో ఉమ్మడి పాస్ రోజువారీ ధర రూ.400గా, నెలవారీ ధర రూ.8,500గా ఉంది. ఈ ధరలపై ప్రయాణికుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం పునఃపరిశీలనకు సిద్ధమైంది. ముఖ్యంగా నిత్యం ఉద్యోగాలు, మిగతా2లో...



## మహిళలకు 50 శాతం సీట్లు కేటాయిస్తాం: కవిత

**తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 12:** తమ పార్టీ తరఫున మహిళలకు 50 శాతం సీట్లు కేటాయిస్తామని తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించారు. ఇతర రాజకీయ పార్టీలు రిజర్వేషన్లు అమలు చేసినా, చేయకపోయినా తమ పార్టీ మహిళలకు సగం సీట్లు ఇస్తుందని స్పష్టం చేశారు. మహిళా నాయకత్వాన్ని ప్రోత్సహించడంతో పాటు మహిళలు, బహుజనుల సంక్షేమం కోసం కృషి చేస్తానని తెలిపారు. ఈ దిశగా తనకు ప్రజలు ఆశీర్వాదం అందించాలని విజ్ఞప్తి చేశారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో మిగతా2లో...

## సీఈసీపై
# జనాగ్రహం..

**ఢిల్లీలో ఇండియా కూటమి భారీ ప్రదర్శన**

**ఓటు హక్కుల పరిరక్షణకు నినాదాలు.. జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు డిమాండ్**




**తొలి అక్షరం/న్యూఢిల్లీ, 12:** ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి నేతలు సోమవారం ఢిల్లీలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై నిరసన వ్యక్తం చేశారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును పరిరక్షించాలని, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత ఉండాలని డిమాండ్ చేస్తూ సుప్రీంకోర్టు వైపు ర్యాలీగా బయలుదేరారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, తెలంగాణ మిగతా2లో...

## ఎల్‌నినోపై ప్రభుత్వానికి స్పష్టమైన
# కార్యాచరణ ఏదీ?

**రైతులు, కూలీలకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలి: హరీశ్‌రావు**




**తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 12 :** ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయ రంగం ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళిక రూపొందించాలని బీఆర్‌ఎస్‌ఎల్పీ ఉపనేత, మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. రైతులు, వ్యవసాయ కూలీలు ఇబ్బందులు పడకుండా ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు.తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నీటి కొరత, విద్యుత్ సమస్యలతో రైతులు మిగతా2లో...

# సుప్రీంకోర్టును రాజకీయ వివాదాల్లోకి లాగొద్దు

**- సీజేఐ సూర్యకాంత్**



**తొలి అక్షరం/న్యూఢిల్లీ,అక్టోబర్ 12 :** సుప్రీంకోర్టును రాజకీయ వివాదాల్లోకి లాగవద్దని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. ఢిల్లీలో కొనసాగుతున్న నిరసనల కారణంగా న్యాయస్థాన కార్యకలాపాలకు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, కక్షిదారుల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగకూడదని సూచించారు. ప్రజాస్వామ్యంలో నిరసనలు తెలిపే హక్కు ఉన్నప్పటికీ, మిగతా2లో...

# ఆర్టీసీ – మెట్రో ఉమ్మడి పాస్ చార్జీలపై పునఃసమీక్ష

(మొదటి పేజీ తరువాయి)

వ్యాపారాలు, ఇతర అవసరాల కోసం ప్రయాణించే వారికి పాస్ ధరలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నా యి. **ఉన్నతాధికారు లతో చర్చించి నిర్ణయం** ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచనల మేరకు ఉమ్మడి పాస్ చార్జీలను పునఃసమీక్షించనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ అంశంపై త్వరలోనే ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి, ప్రయాణికులకు అనుకూలంగా ఉండే ధరలపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో ప్రజా రవాణా సేవలను వినియోగించే ప్రయాణికులకు ఆర్థిక భారం తగ్గించే దిశగా ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై ఆసక్తి నెలకొంది. అయితే సవరించిన చార్జీలపై ప్రభుత్వం ఇంకా తుది నిర్ణయం ప్రకటించాల్సి ఉంది.

# మోదీకి కేసీఆర్ గతే: పొంగులేటి



**తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 12:** ప్రజల గొంతును అణచివేయాలని చూస్తే వారికి రాజకీయంగా తగిన గుణపాఠం తప్పదని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికి, రాజకీయ పార్టీలకు ఉందని పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రజలు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ ప్రధాన వేదికగా ఉండేదని పొంగులేటి గుర్తుచేశారు. అయితే, కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ధర్నా చౌక్‌ను తొలగించి ప్రజల నిరసన హక్కును అడ్డుకుందని విమర్శించారు. నిరసన తెలిపే అవకాశాలను పరిమితం చేసినందుకు ప్రజలు ఎన్నికల్లో తగిన సమాధానం చెప్పారని అన్నారు. కేసీఆర్ అనుసరించిన విధానాలనే ప్రస్తుతం కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తోందని పొంగులేటి ఆరోపించారు. ఢిల్లీలో జంతర్‌మంతర్ వంటి ప్రాంతాల్లో నిరసనలు తెలిపే హక్కులపై ఆంక్షలు విధించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను వినకుండా, ప్రతిపక్షాలకు తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే అవకాశం లేకుండా చేయడం సరికాదన్నారు. ప్రజల గొంతును అణచివేయాలని చూసే పాలకులకు ప్రజలే తగిన సమాధానం చెబుతారని పొంగులేటి హెచ్చరించారు. నిరసన హక్కును గౌరవించాలని, ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని ఆయన కోరారు.

# పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ స్వర్గధామం

**తొలి అక్షరం/కాకినాడ అక్టోబర్ 12:** ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడులకు స్వర్గధామంగా తీర్చిదిద్దుతున్నామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. పారిశ్రామికవేత్తలు లాభాలతోపాటు దేశాభివృద్ధికి ప్రాధాన్యమివ్వాలని కోరారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అనుమతులు, ప్రోత్సాహకాలను వేగంగా అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కాకినాడ జేఎన్‌టీయూలో సోమవారం నిర్వహించిన భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ప్రాంతీయ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. గత ప్రభుత్వ హయాంలో పరిశ్రమల ఏర్పాటుకు ఇబ్బందులు ఉండేవని పవన్ కల్యాణ్ విమర్శించారు. ప్రస్తుతం పెట్టుబడిదారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, రాష్ట్రంలో అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పారిశ్రామి కవేత్తలకు పిలుపునిచ్చారు. పరిశ్రమల ద్వారా స్థానిక ప్రజలకు ఉపాధి కల్పించడంతోపాటు ఆర్థిక అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. **రూ.6,347 కోట్ల పెట్టుబడులతో కొత్త అవకాశాలు** కాకినాడలో నిర్వహించిన సీఐఐ ప్రాంతీయ సదస్సులో 16 అవగాహన ఒప్పందాల ద్వారా రూ.4,652 కోట్ల పెట్టుబడులకు




సంబంధించిన కార్యక్రమాలతోపాటు, రూ.2,090 కోట్లతో నాలుగు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు జరిగినట్లు పవన్ కల్యాణ్ తెలిపారు. వీటి ద్వారా సుమారు 18 వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఈ పెట్టుబడులు కాకినాడ, పరిసర ప్రాంతాల పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. **714 ప్రాజెక్టుల ద్వారా రూ.22.6 లక్షల కోట్ల పెట్టుబడులు** 2024 జూన్ నుంచి రాష్ట్రానికి 714 ప్రాజెక్టుల రూపంలో రూ.22.6 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చినట్లు పవన్ కల్యాణ్ తెలిపారు. వీటిలో రూ.16.6 లక్షల కోట్ల ప్రాజెక్టులకు అనుమతులు పూర్తయ్యాయని, రూ.4.7 లక్షల కోట్ల ప్రాజెక్టులు కార్యరూపంలోకి వచ్చాయని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా 7.1 లక్షల ఉద్యోగాలు అందుబాటులోకి రానున్నాయని వివరించారు. పరిశ్రమలు వాస్తవంగా ప్రారంభమయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. **పర్యావరణ పరిరక్షణతో సమగ్ర అభివృద్ధి** కాకినాడలో నౌకా నిర్మాణం, గ్రీన్ హైడ్రోజన్, ఆహార శుద్ధి, ఆక్వా పరిశ్రమలకు అవకాశాలు ఉన్నాయని పవన్ కల్యాణ్ అన్నారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లోనూ పరిశ్రమలు ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉపాధి కల్పించాలని పారిశ్రామికవేత్తలను కోరారు. రాష్ట్ర తీర ప్రాంత పరిరక్షణతోపాటు పచ్చదనం పెంపునకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందేలా పర్యావరణహిత పారిశ్రామిక విధానాలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్దన్ రెడ్డి, కందుల దుర్గేష్, ఎంపీలు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, హరీష్ మాధుర్, సానా సతీష్ బాబు, ఎమ్మెల్యేలు వనమాడి వెంకటేశ్వరరావు, పంతం వెంకటేశ్వరరావు, సీఐఐ ఆంధ్రప్రదేశ్ వైస్ ఛైర్మన్ సాంబశివరావు పాల్గొన్నారు.

# సుప్రీంకోర్టును రాజకీయ వివాదాల్లోకి లాగొద్దు

(మొదటి పేజీ తరువాయి)

వాటి వల్ల న్యాయస్థానాల విధులకు అంతరాయం కలగకూడదని పేర్కొన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా అక్టోబర్ 10న ఢిల్లీలో జరిగిన నిరసనల సందర్భంగా న్యాయవాదులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారనే ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారంపై దాఖలైన పిటిషన్ల విచారణ సందర్భంగా న్యాయవాదులు ఎదుర్కొన్న ఇబ్బందులను సీనియర్ న్యాయవాదులు ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్ స్పందిస్తూ, శాంతియుతంగా నిరసనలు తెలిపేందుకు ఎవరికీ అభ్యంతరం లేదని, అయితే కోర్టు కార్యకలాపాలకు ఆటంకం కలిగించరాదని స్పష్టం చేశారు. న్యాయవాదులు, సిబ్బంది, కక్షిదారుల స్వేచ్ఛాయుత రాకపోకలకు ఎలాంటి అడ్డంకులు ఉండకూడదని పేర్కొన్నారు. ఈ వ్యవహారానికి సంబంధించిన పిటిషన్లను తదుపరి విచారణ కోసం ధర్మాసనం మంగళవారానికి వాయిదా వేసింది.

# భారత వ్యతిరేక శక్తులన్నీ ఏకమవుతున్నాయి: కిరణ్ రిజిజు



**తొలి అక్షరం/న్యూఢిల్లీ,అక్టోబర్ 12:** కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగ, ప్రజాస్వామ్య సంస్థలను లక్ష్యంగా చేసుకుంటోందని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు విమర్శించారు. భారత వ్యతిరేక శక్తులన్నీ చేతులు కలుపు తున్నాయని, దేశభక్తుల ంతా ఏకమవుతారని వ్యాఖ్యా నించారు. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ రాజీనామా చేయాలంటూ కేరళ కాంగ్రెస్ సామాజిక మాధ్యమంలో చేసిన వ్యాఖ్యలపై రిజిజు స్పందించారు. ఢిల్లీలో ఆందోళనల నేపథ్యంలో శాంతిభద్రతలు తన పరిధిలోని అంశం కాదని ప్రధాన న్యాయమూర్తి పేర్కొన్న వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, కేరళ కాంగ్రెస్ ఆయన రాజీనామాను డిమాండ్ చేసింది. అనంతరం ఆ పోస్టును తొలగించింది. ఈ పరిణామంపై రిజిజు తీవ్రంగా స్పందిస్తూ, ఎన్నికల సంఘం తర్వాత కాంగ్రెస్ తదుపరి లక్ష్యం న్యాయవ్యవస్థేనని తాను గతంలోనే చెప్పానన్నారు. దేశంలోని రాజ్యాంగ వ్యవస్థలు, ప్రజాస్వామ్య సంస్థలను బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలతో కాంగ్రెస్, భాజపా మధ్య రాజకీయ విమర్శలు మరింత వేడెక్కాయి.

# ఎల్‌నినోపై ప్రభుత్వానికి స్పష్టమైన కార్యాచరణ ఏదీ?

(మొదటి పేజీ తరువాయి)

ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. యాసంగి పంటలు వేయవద్దని సూచిస్తే రైతులు, వ్యవసాయ కూలీల జీవనోపాధికి భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. ఉపాధి లేక ప్రజలు మళ్లీ వలసలు వెళ్లే పరిస్థితి రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ సరఫరా, సాగునీటి సమస్యలను పరిష్కరించడంతో పాటు రైతులకు అందాల్సిన పథకాలపై స్పష్టత ఇవ్వాలని హరీశ్‌రావు కోరారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ రంగానికి నష్టం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, రైతులు, కూలీలకు ప్రభుత్వం భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు.

# 41 బార్ల అనుమతుల కోసం 2,200 దరఖాస్తులు



**తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 12:** తెలంగాణలో కొత్త బార్ల ఏర్పాటు కోసం భారీగా దరఖాస్తులు వచ్చాయి. రాష్ట్ర ఆబ్కారీ శాఖ జారీ చేసిన ప్రకటన ప్రకారం 41 బార్ల అనుమతుల కోసం సుమారు 2,200 దరఖాస్తులు అందాయి. దరఖాస్తుల స్వీకరణకు సోమవారం చివరి రోజు కావడంతో సంబంధిత కార్యాలయాల వద్ద సందడి నెలకొంది. మొత్తం 41 బార్లలో 14 హైదరాబాద్ నగర ప్రధాన ప్రాంతంలో ఉండగా, మిగిలిన 27 బార్లను ఇతర నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాల పరిధిలో ఏర్పాటు చేయనున్నారు. దరఖాస్తుల స్వీకరణ సజావుగా సాగేందుకు ఆబ్కారీ కమిషనర్ కార్యాలయంతో పాటు హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి పరిధిలోని సంబంధిత కార్యాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఒక్కో దరఖాస్తుకు రూ.లక్ష రుసుముగా నిర్ణయించారు. కొత్త బార్ల ఏర్పాటుకు ఇంత పెద్ద సంఖ్యలో దరఖాస్తులు రావడంతో అనుమతుల కేటాయింపుపై ఆసక్తి నెలకొంది. తదుపరి దశలో దరఖాస్తులను పరిశీలించి, నిబంధనల ప్రకారం అర్హులకు అనుమతులు కేటాయించేందుకు అధికారులు చర్యలు చేపట్టనున్నారు.

# ఆరు రాష్ట్రాలకు కొత్త గవర్నర్లు

(మొదటి పేజీ తరువాయి)

మాథుర్‌ను కేరళ గవర్నర్‌గా నియమించారు. కేరళ గవర్నర్‌గా ఉన్న రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌కు తమిళనాడు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇక ఒడిశా గవర్నర్‌గా బ్రజ్ మోహన్ రామ్, కర్ణాటక గవర్నర్‌గా డాక్టర్ సుధా యాదవ్, ఉత్తరాఖండ్ గవర్నర్‌గా డాక్టర్ ధాల్ సింగ్ బిసేన్, సిక్కిం గవర్నర్‌గా దుష్యంత్ గౌతమ్‌ను నియమించారు. **నలుగురికి కొత్త బాధ్యతలు** ఈ నియామకాల్లో భాగంగా బ్రజ్ మోహన్ రామ్, సుధా యాదవ్, ధాల్ సింగ్ బిసేన్, దుష్యంత్ గౌతమ్‌లకు కొత్తగా గవర్నర్ బాధ్యతలు అప్పగించారు. మరోవైపు ఓం ప్రకాశ్ మాథుర్, రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌లను ఇతర రాష్ట్రాలకు బదిలీ చేశారు. ఆయా రాష్ట్రాల్లో రాజ్యాంగబద్ధమైన బాధ్యతలను నిర్వహించేందుకు ఈ నియామకాలు చేపట్టినట్లు రాష్ట్రపతి భవన్ ప్రకటనలో పేర్కొంది. దేశంలోని ఆరు రాష్ట్రాల్లో గవర్నర్ల మార్పులతో ఆయా రాష్ట్రాల రాజ్యాంగపరమైన వ్యవహారాల్లో కొత్త నియామకాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కొత్త గవర్నర్లు బాధ్యతలు స్వీకరించిన తర్వాత అధికారికంగా తమ విధులను ప్రారంభించనున్నారు.

# దేశవ్యాప్తంగా 5 వేల ఆలయాల నిర్మాణానికి భారీ ప్రణాళిక

**తొలి అక్షరం/అమరావతి: అక్టోబర్ 12:** దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత విస్తరించడంతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో ఆలయాల నిర్మాణాన్ని ప్రోత్సహించే దిశగా 5 వేల ఆలయాల నిర్మాణానికి ప్రణాళిక రూపొందించారు. ఈ లక్ష్యాన్ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు వేగవంతం చేయాలని అధికారులు సూచించారు. ముఖ్యంగా పేదలు, అణగారిన వర్గాలు నివసించే ప్రాంతాల్లో ఆలయాల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఆలయాల నిర్మాణానికి వచ్చిన ప్రతిపాదనలను పరిశీలించి, అర్హమైన ప్రాంతాలను గుర్తించాలని అధికారులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాలు, గిరిజన ఆవాసాలు, మత్స్యకారుల నివాస ప్రాంతాలు, బలహీన వర్గాల కాలనీల్లో ఆలయాలు నిర్మించడం ద్వారా స్థానిక ప్రజలకు ఆధ్యాత్మిక కేంద్రాలు అందుబాటులోకి వస్తాయని భావిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో ప్రజల అవసరాలు, అందుబాటులో ఉన్న స్థలాలు, నిర్మాణానికి అవసరమైన సదుపాయాలను పరిగణనలోకి తీసుకుని పనులు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమానికి సంబంధించి 28 జిల్లాల్లోని 161 నియోజకవర్గాల నుంచి మొత్తం 4,192 ఆలయాల నిర్మాణానికి ప్రతిపాదనలు అందినట్లు అధికారులు వెల్లడించారు. వాటిలో 967 ఆలయాల నిర్మాణం ఇప్పటికే పూర్తయినట్లు తెలిపారు. మిగిలిన ఆలయాల నిర్మాణానికి అవసరమైన స్థలాల గుర్తింపు, అనుమతులు, నిధుల కేటాయింపు, నిర్మాణ పనుల పురోగతిపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని నిర్ణయించారు. ఆలయాల నిర్మాణం కేవలం భవనాల ఏర్పాటుకే పరిమితం కాకుండా, స్థానిక ప్రజల ఆధ్యాత్మిక అవసరాలను తీర్చేలా ఉండాలని అధికారులు భావిస్తున్నారు. నిర్మాణాల విషయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించడంతో పాటు, అందుబాటులో ఉన్న నిధులను సమర్థంగా వినియోగించాలని సూచించారు. నిర్మాణ పనుల్లో జాప్యం జరగకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. ఈ లక్ష్యాన్ని 2028 నాటికి పూర్తి చేయాలని ప్రణాళిక రూపొందించినట్లు సమాచారం. ఆలయాల నిర్మాణానికి సంబంధించి ఇప్పటికే పూర్తయిన పనులు, కొనసాగుతున్న పనులు, ఇంకా ప్రారంభం కావాల్సిన పనుల వివరాలను సేకరించి తదుపరి కార్యాచరణ సిద్ధం చేయనున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం నెరవేరితే వివిధ ప్రాంతాల్లోని ప్రజలకు స్థానికంగానే ఆలయాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

# సీఈసీపై జనాగ్రహం..

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహా పలువురు ప్రతిపక్ష నాయకులు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. పోలీసులు భారీగా మోహరించి ర్యాలీని అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. సుప్రీంకోర్టుకు సమీపంలో నిరసనకారులను పోలీసులు నిలువరించారు. ఎన్నికల సంఘం వ్యవహారశైలిపై సమాధానం చెప్పాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఓటర్ల హక్కుల పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని ప్రతిపక్ష నేతలు స్పష్టం చేశారు.

# ఎన్నికల్లో ఓటమి భయంతోనే 'సర్' అమలు

(మొదటి పేజీ తరువాయి)

అత్యంత ముఖ్యమని, అర్హులైన ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించడం ప్రజాస్వామ్యానికి నష్టం కలిగిస్తుందని పేర్కొన్నారు. ఓటు హక్కు కోల్పోతే పేదలు తమ సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లే అవకాశాన్ని కూడా కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల సంఘం స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా పనిచేయాల్సిన రాజ్యాంగబద్ధ సంస్థ అని పేర్కొంటూ, దాని వ్యవహారశైలిపై అనుమానాలు తలెత్తితే వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. ఎన్నికల సంఘం నియామక విధానంలో ప్రధాన న్యాయమూర్తిని ఎంపిక ప్రక్రియ నుంచి తొలగించడాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. భారతీయ జనతా పార్టీ మతాలు, ప్రాంతాల మధ్య విభేదాలను పెంచుతోందని రేవంత్‌రెడ్డి విమర్శించారు. ఓటర్ల జాబితా సవరణ పేరుతో తమకు అనుకూలంగా లేని ఓటర్ల పేర్లను తొలగిస్తున్నారన్నది ఆయన ప్రధాన ఆరోపణ. కృత్రిమ మేధ సాయంతో భాజపాకు వ్యతిరేకంగా ఉన్నవారి ఓట్లను తొలగిస్తున్నారని కూడా ఆరోపించారు. అయితే, ఈ ఆరోపణలకు సంబంధించి ఎన్నికల సంఘం నుంచి వచ్చిన అధికారిక నిర్ధారణను ఆయన ప్రస్తావించలేదు. గతంలో కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉపయోగించి రాజకీయ ప్రత్యర్థులను ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించిన రేవంత్‌రెడ్డి, ఇప్పుడు ఎన్నికల సంఘాన్ని కూడా రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, పౌరుల ఓటు హక్కును కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అర్హులైన ఏ ఒక్కరి పేరు కూడా అన్యాయంగా తొలగిపోకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని విస్తరిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో వినిపించిన నినాదాల తరహాలోనే ఇప్పుడు 'సర్ వెనక్కి వెళ్లాలి' అనే నినాదంతో పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం నిలబెట్టేందుకు ఎన్నికల సంఘం పారదర్శకంగా వ్యవహరించాలని ఆయన కోరారు.

# మహిళలకు 50 శాతం సీట్లు కేటాయిస్తాం: కవిత

(మొదటి పేజీ తరువాయి)

సోమవారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్టీ ఏర్పాటు చేసిన తర్వాత కార్యాలయంలో బతుకమ్మ సంబురాలు జరుపుకోవడం సంతోషంగా ఉందని కవిత అన్నారు. మహిళా నాయకులతో కలిసి బతుకమ్మలు పేర్చి, పాటలు పాడారు. అనంతరం గౌరమ్మకు పూజలు చేసి బతుకమ్మ ఆడారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ ప్రతీకగా నిలుస్తుందని కవిత పేర్కొన్నారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో ఈ పండుగ ద్వారా మహిళలను ఒక్కతాటిపైకి తీసుకురావడానికి కృషి చేశామని గుర్తుచేశారు. బతుకమ్మ పాటలను నేర్చుకుని భావితరాలకు అందించాలని, తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి చాటిచెప్పాలని పిలుపునిచ్చారు.

# ఖమ్మానికి ఆధ్యాత్మిక శోభను తీసుకురానున్న శ్రీవారి ఆలయం

**కులమతాలకు అతీతంగా ధర్మమార్గంలో పయనించాలి: త్రిదండి చిన్నజీయర్ స్వామి**

**ఆలయ నిర్మాణానికి మంత్రి తుమ్మల కృషి కీలకం: టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడు**











**తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి అక్టోబర్ 12 :** ఖమ్మం ప్రాంతానికి ఆధ్యాత్మిక శోభను తీసుకువచ్చేలా తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం చేపట్టడం శుభపరిణామమని శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి అన్నారు. సోమవారం ఖమ్మం నగరంలోని కొత్తగూడెం అల్లీపురంలో నిర్మించనున్న ఆలయానికి చిన్నజీయర్ స్వామి, టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడు, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తదితరులు భూమిపూజ చేసి శంకుస్థాపన నిర్వహించారు. వేదమంత్రోచ్చారణల మధ్య జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. చిన్నజీయర్ స్వామి మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా ప్రజలంతా ధర్మమార్గంలో పయనించాలని, అందరూ ఒకే భగవంతుని సంతానమనే భావనతో ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. వసుధైక కుటుంబ భావన భారతీయ సంస్కృతికి మూలమని పేర్కొన్నారు. ఆలయాలు కేవలం పూజా కార్యక్రమాలకే పరిమితం కాకుండా మానవత్వం, పరస్పర సహకారం, ధర్మం, సామాజిక ఐక్యతను పెంపొందించే ఆధ్యాత్మిక కేంద్రాలుగా నిలవాలని అన్నారు. ఖమ్మంలో నిర్మించనున్న శ్రీవారి ఆలయం ప్రజలకు ఆధ్యాత్మిక మార్గదర్శకంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆలయ నిర్మాణానికి భక్తులందరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఖమ్మంలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి భూమిపూజ, శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. చిన్నజీయర్ స్వామి, టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. భద్రాచలం ఆలయ అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని, ఖమ్మంలోనూ శ్రీవారి ఆలయ నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంతం ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడు మాట్లాడుతూ ఖమ్మంలో ఆలయ నిర్మాణం ప్రారంభం కావడానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేసిన కృషి ప్రధాన కారణమని తెలిపారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో టీటీడీ ఆధ్వర్యంలో ఆలయాల నిర్మాణం చేపడుతున్నామని, ఖమ్మం ఆలయాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆలయ నిర్మాణానికి స్థానిక భక్తులు కూడా నిధులు సమకూర్చాలని, అందరి సహకారంతో పనులు పూర్తి చేస్తామని పేర్కొన్నారు. **ఆలయ నిర్మాణానికి రూ.1.46 కోట్ల విరాళాలు** ఖమ్మంలో నిర్మించనున్న శ్రీవారి ఆలయానికి ఎంపీ బండి పార్థసారథి రెడ్డి రూ.60 లక్షలు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర రూ.50 లక్షలు, ఎమ్మెల్సీ తాతా మధు రూ.25 లక్షలు విరాళంగా ప్రకటించారు. కార్యక్రమంలో భోజన ఏర్పాట్లు చేసిన వ్యక్తి మరో రూ.11 లక్షలు విరాళంగా ప్రకటించారు. దీంతో మొత్తం రూ.1.46 కోట్ల విరాళాలు ప్రకటించినట్లయింది. ఆలయ నిర్మాణంలో భక్తులందరూ భాగస్వాములు కావాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, మట్టా రాగమయి దయానంద్, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., పోలీస్ కమిషనర్ సునీల్ దత్, టీటీడీ జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎ. శరత్, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# రాచకొండ బతుకమ్మ వేడుకలకు భాస్కర్ ముఖ్య అతిథి

**- చౌటుప్పల్‌లో రేపు బతుకమ్మ పోటీలు.. విజేతలకు భారీ నగదు బహుమతులు**



**తొలి అక్షరం / చౌటుప్పల్, అక్టోబర్ 12:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీకగా రాచకొండ బతుకమ్మ వేడుకలు2026 నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రాచకొండ దసరా ఉత్సవ సమితి, ఇ.ఎల్.వి. భాస్కర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో అక్టోబర్ 13న చౌటుప్పల్‌లో జరిగే వేడుకలకు ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఇరగదిండ్ల భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు టీజీ ఆర్టీసీ బస్టాండ్ పక్కన బతుకమ్మ వేడుకలు, పోటీలు నిర్వహించనున్నారు. పోటీల్లో విజేతలకు మొదటి బహుమతిగా రూ.20 వేలు, రెండో బహుమతిగా రూ.15 వేలు, మూడో బహుమతిగా రూ.10 వేలు అందజేయనున్నారు. మహిళలు, ఆడపడుచులు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ సంబరాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. పోటీల్లో పాల్గొనాలనుకునేవారు ముందస్తుగా ఉచిత రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ కోసం సంప్రదించాల్సిన నంబర్లు: 9542659275, 9676808858, 8978738372, 9849012408. తెలంగాణ సంస్కృతి వైభవాన్ని చాటుతూ, కుటుంబ సభ్యులతో కలిసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొనాలని రాచకొండ దసరా ఉత్సవ సమితి, ఇ.ఎల్.వి. భాస్కర్ ఫౌండేషన్ ప్రతినిధులు కోరారు.

# పంతంగిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**- గ్రామ ప్రజలకు స్మార్ట్ రేషన్ కార్డులు అందజేసిన సర్పంచ్ శ్రీలత సుందర్**







**తొలి అక్షరం/చౌటుప్పల్.అక్టోబర్ 12:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన స్మార్ట్ రేషన్ కార్డులను సోమవారం పంతంగి గ్రామపంచాయతీ కార్యాలయం ముందు గ్రామ ప్రజలకు పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ కాకి శ్రీలత సుందర్, ఉప సర్పంచ్ బోయ సదానందం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీలత సుందర్ గ్రామ ప్రజలకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రజలకు చేరేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బోయ సదానందం, పంచాయతీ కార్యదర్శి కె. పద్మజ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బోయ దేవేందర్, జీపీఓ ధన్వంత్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయ వెంకట్, వార్డు సభ్యులు రత్నం శ్రీకాంత్, బోయ హరిత కిరణ్, అంతటి సౌజన్య ప్రవీణ్, బండ శేఖర్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కొండ నరసింహ, మాజీ ఉప సర్పంచ్ బోయ అంబేద్కర్, కడగంచి జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించేలా బతుకమ్మ వేడుకలు

**ఘనంగా నిర్వహించాలి: కలెక్టర్ దివాకర టీఎస్**

**ఇందిరమ్మ మహిళా డెయిరీ పథకంలో అవినీతికి తావులేకుండా అర్హులకు లబ్ధి చేకూర్చాలి**



**తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి అక్టోబర్ 12 :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆత్మగౌరవం ప్రతిబింబించేలా బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డిలతో కలిసి బతుకమ్మ వేడుకలు, ఇందిరమ్మ మహిళా డెయిరీ పథకం అమలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బతుకమ్మ వేడుకల్లో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేయాలని, అన్ని మండలాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. వేడుకలు జరిగే ప్రాంతాల్లో పారిశుద్ధ్యం, విద్యుత్ దీపాలు, మైక్ వ్యవస్థ, నిమజ్జన ప్రాంతాల్లో ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. మహిళలు, బాలికల ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఇందిరమ్మ మహిళా డెయిరీ పథకంలో మొదటి విడత యూనిట్ల మంజూరు ప్రక్రియను పూర్తి చేసి, పశువుల కొనుగోలుపై క్షేత్రస్థాయి పరిశీలనలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. పథకం అమలులో అవినీతికి తావులేకుండా అర్హులైన మహిళలకు లబ్ధి చేకూర్చాలని, అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పశువుల షెడ్లు, పశు గ్రాసం, పాల సేకరణ వంటి సదుపాయాలతో సమగ్ర ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు. అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ అక్టోబర్ 10 నుంచి 18 వరకు శాఖల వారీగా బతుకమ్మ కార్యక్రమాలు నిర్వహించాలని, అక్టోబర్ 18న పెవిలియన్ గ్రౌండ్స్‌లో సద్దుల బతుకమ్మ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్రధాన కూడళ్లలో పూల బతుకమ్మలు ఏర్పాటు చేయడంతో పాటు చెరువులు, ట్యాంక్‌బండ్ల వద్ద నిమజ్జన ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ఆసుపత్రులు, దేవాలయాలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలోనూ పండుగ వాతావరణం కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి రామ్మూర్తి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# పల్లె సేవకు జాతీయ గౌరవం.. ప్రజా నాయకత్వానికి అరుదైన గుర్తింపు!

- **గ్రామాభివృద్ధే లక్ష్యం.. జాతీయ అవార్డే సర్పంచ్ సేవలకు సాక్ష్యం**
- **గిరాయి గుట్ట తాండా నుంచి ఢిల్లీ దాకా.. కృష్ణవేణి హరినాయక్‌కు జాతీయ కీర్తి!**



**తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్12:** గ్రామాభివృద్ధే లక్ష్యంగా ప్రజలకు సేవలందించే ప్రజాప్రతినిధులకు గుర్తింపు లభిస్తే అది ఆ గ్రామానికే గర్వకారణం. ఫరూఖ్‌నగర్ మండలం గిరాయి గుట్ట తాండా గ్రామపంచాయతీ సర్పంచ్ పాతలవత్ కృష్ణవేణి హరినాయక్ జాతీయ స్థాయి అవార్డుకు ఎంపికై తన గ్రామానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు. బహుజన సాహిత్య అకాడమీ ప్రకటించిన 2026 ఉత్తమ సర్పంచ్ నేషనల్ అవార్డుకు ఆమె ఎంపిక కావడం విశేషం. **గ్రామస్థాయి నుంచి జాతీయ స్థాయికి..** స్థానిక ప్రజాప్రతినిధిగా సేవలందిస్తున్న కృష్ణవేణి హరినాయక్‌కు ఈ పురస్కారం దక్కడం గ్రామీణ పాలనలో ప్రజాసేవకు లభించిన గుర్తింపుగా నిలుస్తోంది. గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర ఎంత కీలకమో ఈ ఎంపిక చాటిచెబుతోంది. గ్రామ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసే నాయకత్వానికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించడం ఇతర ప్రజాప్రతినిధులకు స్ఫూర్తినిచ్చే అంశం. **నవంబర్ 15న పురస్కార ప్రదానం** హైదరాబాద్‌లోని అకాడమీ కార్యాలయంలో జాతీయ అధ్యక్షుడు, అవార్డు ఎంపిక కమిటీ చైర్మన్ నల్లా రాధాకృష్ణ ఆమెకు ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. న్యూఢిల్లీలో నవంబర్ 15న జరిగే అకాడమీ 20వ జాతీయ సదస్సులో ఈ అవార్డును ప్రదానం చేయనున్నారు. 28 రాష్ట్రాల నుంచి సుమారు వెయ్యి మంది ప్రతినిధులు పాల్గొననున్న ఈ సదస్సులో కృష్ణవేణి పురస్కారం అందుకోనున్నారు. ఈ ఘనతతో గిరాయి గుట్ట తాండా పేరు జాతీయ స్థాయిలో మారుమోగనుంది.



# ఎఫ్ఐఆర్ నమోదు చేశాకే దహన సంస్కారాలు జరపాలి

**- జవహర్‌నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ డిమాండ్**



**తొలి అక్షరం/జవహర్‌నగర్, అక్టోబర్ 12:** జవహర్‌నగర్ రాంకీ డంపింగ్ యార్డు ప్రభావిత ప్రాంతాల్లో సంభవిస్తున్న అనారోగ్య మరణాలపై సంబంధిత పోలీస్ స్టేషన్లలో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన తర్వాతే దహన సంస్కారాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డికి ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించింది. జేఏసీ చైర్మన్ షేక్ షావలి, కన్వీనర్ ఉమామహేష్ అధ్యక్షతన ప్రజా సంఘాల ప్రతినిధులు డంపింగ్ యార్డును శాస్త్రీయ పద్ధతిలో శాశ్వతంగా మూసివేయాలని కోరారు. ప్రభావిత ప్రాంతాల్లో పర్యావరణాన్ని పునరుద్ధరించి, ప్రజలకు ఉచితంగా స్వచ్ఛమైన తాగునీరు, మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. డంపింగ్ యార్డు నుంచి వెలువడుతున్న దుర్వాసన, విషవాయువులు, మురుగునీటి వల్ల ప్రజలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని ప్రతినిధులు తెలిపారు. కార్మికనగర్, గబ్బిలాలపేట, శాంతినగర్, ఆర్జీకాలనీ, ధమ్మాయిగూడ, ఈస్ట్ నందమూరి నగర్ తదితర ప్రాంతాల్లో సమస్యలు తీవ్రంగా ఉన్నాయని పేర్కొన్నారు. డంపింగ్ యార్డు సమస్యపై గతంలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, వాటి అమలు వివరాలను ప్రజలకు వెల్లడించాలని కోరారు. గ్రేటర్ హైదరాబాద్ చెత్తను జవహర్‌నగర్‌కు తరలించకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించకపోతే ప్రజా ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ ప్రతినిధులు గడ్డం సదానందం, పి. శివబాబు, వై. మల్లేష్, వి. ప్రవీణ్, గడిపె సునీత, సురేందర్, జయసుధ, బద్రగామి ఆంజనేయులు, రాజనర్సింహ తదితరులు పాల్గొన్నారు.

# మళ్లీ వలిగొండ రోడ్డు జంక్షన్ మూసివేత!

- ప్రత్యామ్నాయ మార్గం లేక ప్రజలకు ఇబ్బందులు
- జంక్షన్ పునరుద్ధరించకపోతే జాతీయ రహదారిపై రాస్తారోకో: చెరుకు శివకుమార్ గౌడ్



**తొలి అక్షరం/చౌటుప్పల్, అక్టోబర్ 12**: వలిగొండ రోడ్డు జంక్షన్‌ను ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండానే అధికారులు మళ్లీ మూసివేయడంపై చెరుకు శివకుమార్ గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జంక్షన్ మూసివేతతో ప్రజలు, వాహనదారులు రహదారి దాటేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.గతంలో జంక్షన్ మూసివేతపై స్థానికులు ఆందోళన చేయడంతో అధికారులు స్పందించి మార్గాన్ని పునరుద్ధరించారని గుర్తుచేశారు. ఇప్పుడు మళ్లీ మూసివేయడం వల్ల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని జంక్షన్‌ను వెంటనే పునరుద్ధరించాలని, లేదంటే సురక్షితమైన ప్రత్యామ్నాయ మార్గాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ప్రజా సమస్యను అధికారులు నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని చెరుకు శివకుమార్ గౌడ్ హెచ్చరించారు. జంక్షన్‌ను పునరుద్ధరించకపోతే జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ప్రజలకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.

# కలం కవాతు రచయిత కట్టెల లింగస్వామికి ఘన సన్మానం!

**- సామాజిక సమస్యలను ఎత్తిచూపుతూ ప్రజల్లో చైతన్యం నింపుతున్న రచయిత**




**తొలి అక్షరం/చౌటుప్పల్: అక్టోబర్ 12:** తెలంగాణ ఉద్యమకారుడు, రచయిత కట్టెల లింగస్వామి రచించిన కలం కవాతు పుస్తకం ద్వారా సామాజిక సమస్యలను ఎప్పటికప్పుడు వెలుగులోకి తీసుకొస్తూ ప్రజల్లో చైతన్యం నింపుతున్నారని చౌటుప్పల్ కోర్టు బార్ అసోసియేషన్ సభ్యులు కొనియాడారు. ఈ సందర్భంగా చౌటుప్పల్ కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలం కవాతు పుస్తక రచయిత కట్టెల లింగస్వామిని ఘనంగా సన్మానించారు.తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న కట్టెల లింగస్వామి, రచయితగా తన కలం ద్వారా సమాజంలోని సమస్యలను ప్రతిబింబిస్తూ ప్రజలను చైతన్యపరుస్తున్నారని సభ్యులు పేర్కొన్నారు. అనేక సామాజిక ఉద్యమాల్లో ముందుండి పోరాడుతున్న ఆయన రచనలు సమాజానికి మరింత స్ఫూర్తినివ్వాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరిన్ని గొప్ప కవితలు, సామాజిక చైతన్యాన్ని పెంపొందించే రచనలను ఆవిష్కరించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తాడూరు పరమేష్, ప్రధాన కార్యదర్శి పడమటి మహిపాల్ రెడ్డి, ఉపాధ్యక్షుడు పిట్టల భిక్షమయ్య, సంయుక్త కార్యదర్శి మక్తాల నరసింహ, కార్యవర్గ సభ్యులు పిల్లలమర్రి కిరణ్, జ్యోతి, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు ఊడుగు శ్రీనివాస్ గౌడ్, బాల్యం వెంకటాచలపతి, సీనియర్ న్యాయవాదులు ముత్యాల సత్తిరెడ్డి, ఎస్.ఆర్. భిక్షపతి, బడుగు శ్రీకాంత్, చామట్ల జంగయ్య, పాల పరమేశ, జక్కర్తి శేఖర్, జిల్లా రమేష్, పిట్టల భరత్, శ్రీకాంత్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు కరెంట్, నీళ్లు కరువు.. బీర్లకు మాత్రం నీళ్లా?

- సాగునీటికి ఇబ్బందులు.. పరిశ్రమలకు నీటి సరఫరాపై ప్రభుత్వ ప్రాధాన్యతలేంటి?
- ప్రభుత్వాన్ని ప్రశ్నించిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఢిల్లి మాధవరెడ్డి



**తొలి అక్షరం/చౌటుప్పల్, అక్టోబర్ 12:** రైతులకు సాగునీరు, విద్యుత్ సక్రమంగా అందక పంటలు ఎండిపోయే పరిస్థితులు నెలకొంటుంటే, బీర్ల ఉత్పత్తికి నీటి సరఫరాపై చర్చలు జరగడం ప్రభుత్వ ప్రాధాన్యతలపై ప్రశ్నలు రేకెత్తిస్తోందని చౌటుప్పల్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఢిల్లి మాధవరెడ్డి విమర్శించారు. రైతుల అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం స్పష్టమైన నీటి విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు.సింగూరు ప్రాజెక్టులో నీటి నిల్వలు తగ్గిపోవడం, రాష్ట్రంలోని పలు జలాశయాల్లో నీటి లభ్యతపై ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో తాగునీరు, సాగునీరు, పారిశ్రామిక అవసరాల మధ్య ప్రభుత్వం ప్రాధాన్యతలను స్పష్టం చేయాలని ఆయన కోరారు. రైతులకు సాగునీరు, పంటలకు అవసరమైన విద్యుత్ అందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నప్పుడు పరిశ్రమలకు నీటి కేటాయింపులపై ప్రభుత్వం ఏ విధంగా నిర్ణయాలు తీసుకుంటోందో వెల్లడించాలని అన్నారు.మద్యం ఉత్పత్తికి నీటి సరఫరాపై ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వం వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని మాధవరెడ్డి కోరారు. బీర్ల ఉత్పత్తి కోసం ప్రత్యేకంగా నీటిని కేటాయించినట్లు అధికారిక ఆధారాలు నిర్ధారించబడని నేపథ్యంలో, ఈ అంశంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.రైతుల సాగునీటి అవసరాలకు కూడా అదే స్థాయిలో ప్రణాళికలు రూపొందించాలని, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఢిల్లి మాధవరెడ్డి డిమాండ్ చేశారు.

# టీబీ బాధితులకు న్యూట్రిషన్ కిట్ల పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

**తొలి అక్షరం/ఖమ్మం, జిల్లా ప్రతినిధి అక్టోబర్ 12:** సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ క్షయవ్యాధి (టీబీ) బాధితులకు న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేశారు. టీబీ బాధితులకు పౌష్టికాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు, వ్యాధి నుంచి కోలుకునేందుకు న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు.టీబీ బాధితులు వైద్యుల సూచనల మేరకు క్రమం తప్పకుండా మందులు వాడుతూ, పౌష్టికాహారం తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. చికిత్స మధ్యలో నిలిపివేయకుండా పూర్తికాలం కొనసాగించాలని, ఆరోగ్య సిబ్బంది సూచనలు పాటించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. రామారావు, టీబీ ఆసుపత్రి ఇన్‌చార్జి, జిల్లా టీబీ నియంత్రణ అధికారిణి డా. నివేదిత, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




# ప్రాణాలర్పించాలా?.. మాజీ సర్పంచుల కన్నీటి గాథ!

**ఊరి బాగు కోసం అప్పులు తెచ్చి పనులు చేస్తే... బిల్లులు ఎగ్గొడతారా?**

**వడ్డీల భారం, ఆత్మహత్యల ముప్పు బాకీలు చెల్లించాలంటూ మాజీ సర్పంచుల ఆర్తనాదం**

**అడిషనల్ కలెక్టర్‌కు వినతి... " ప్రజాక్షేత్రంలో మొర కలెక్టర్ స్పందించి ఆదుకోవాలి...**

**కేసముద్రం, ఇనుగుర్తి నేతల డిమాండ్**

**తొలి అక్షరం/ఇనుగుర్తి అక్టోబర్ 12:** తొలి అక్షరంకథనం: ఊరి బాగు కోసం నిద్రాహారాలు మానారు.. గ్రామాల ప్రగతి కోసం అడిగిన చోటల్లా అప్పులు తెచ్చారు.. సొంత ఆస్తులు కుదువబెట్టి మరీ రోడ్లు, డ్రైనేజీలు, మౌలిక వసతులు కల్పించారు. కానీ తీరా పనులు పూర్తయ్యాక ప్రభుత్వం బిల్లులు ఇవ్వకపోవడంతో, గ్రామాభివృద్ధికి నడుం బిగించిన ప్రజాప్రతినిధులే ఈరోజు అప్పుల ఊబిలో కూరుకుపోయి కన్నీరు మున్నీరవుతున్నారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం, ఇనుగుర్తి మండలాలకు చెందిన మాజీ సర్పంచుల దీనస్థితిపై 'తొలి అక్షరం' ప్రత్యేక కథనం...మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి (గ్రీవెన్స్ డే) వేదికగా మాజీ సర్పంచులు తమ ఆవేదనను వెళ్లగక్కారు. గత ప్రభుత్వ హయాంలో (2022–23) ఎస్డీఎఫ్ గ్రాంట్ కింద మంజూరైన పనులను నమ్మి, ఊరి ప్రగతి కోసం బయట వడ్డీలకు




అప్పులు తెచ్చి పూర్తి చేశారు. కానీ పనులు ముగిసి మూడేళ్లు గడుస్తున్నా ఒక్క రూపాయి బిల్లు కూడా రాకపోవడంతో వారి జీవితాలు రోడ్డున పడ్డాయి.**అప్పుల భారం... ఆత్మహత్యల దారి!** ఈ సందర్భంగా ఇనుగుర్తి మండలం కోమటిపల్లి పాత తండా, తారసింగ్ తండా మాజీ సర్పంచులు నీలం యాకయ్య, ఇస్లావత్ బాలునాయక్, సపావత్ శంకర్, మహమూద్ పట్నంకు చెందిన మురళీ, టౌర్యా తండా మాజీ సర్పంచ్ బీ శ్రీనివాస్ తమ కన్నీటి గాథను 'తొలి అక్షరం' ప్రతినిధితో పంచుకున్నారు: "మేము చేసిన తప్పు ఊరి బాగు కోసం అప్పులు తెచ్చి పనులు చేయడమేనా? తెచ్చిన అప్పులకు వడ్డీలు కొండలా పెరిగిపోయాయి. అప్పుల వాళ్ల ఒత్తిడి తట్టుకోలేక ఇప్పటికే మా తోటి మాజీ సర్పంచులు కొందరు ఆత్మహత్యలు చేసుకున్నారు. మిగిలిన మేమూ అదే



తేది 12-10-2026

శ్రీయుత గౌరవనీయులైన జిల్లా కలెక్టర్, మహబూబాబాద్ గారికి నమస్కరించి వ్రాయునది ఏమనగా...

అర్యా!

విషయం : కేసముద్రం & ఇనుగుర్తి మండలాల మాజీ సర్పంచులు చేసిన SDF నిధుల అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు రాక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నందున వాటిని ఇప్పించుట గురించి విన్నపం.

పైవిషయమునసారము తమరికి విన్నవించు మనవి ఏమనగా మేము అనగా మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మరియు ఇనుగుర్తి మండలాలకు చెందిన మాజీ సర్పంచులము.

గత ప్రభుత్వంలో 2022-23 నిధులకుగాను SDF గ్రాంట్ ద్వారా విడుదల చేసినటువంటి పనులను చేయుటకుగాను మేము బయటనుండి అప్పులు తీసుకువచ్చి చేయించాము. కాని పనులు చేసి మూడేళ్లు గడుస్తున్నప్పటికీ, గత ప్రభుత్వం మాకు బిల్లులు ఇవ్వలేదు ప్రస్తుత ప్రభుత్వం ద్వారానైనా బిల్లులు వస్తాయని ఇప్పటి వరకు వేచి చూస్తున్నాము. కాని ఇట్టి అభివృద్ధి పనులు నిర్వహించేందుకు మేము అప్పులు తెచ్చినచోట వడ్డీలు పెరిగిపోయి మాజీ సర్పంచులము తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుచున్నాము. మాలో కొంతమంది బిల్లులు రాక ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యలు చేసుకున్నారు. ఈ ఆర్థిక ఇబ్బందులతో మరికొంత మంది కూడా ఆత్మహత్యలు చేసుకునే తప్పనిసరి పరిస్థితి నెలకొంది.

కావున దయమయులైన తమరు మాపై దయచూపి మాకు రావలసినటువంటి SDF ద్వారా వచ్చే నిధులను విడుదల చేయించి మమ్ములను ఆర్థికంగా ఆదుకోవాలని మనస్ఫూర్తిగా వేడుకుంటున్నాము.

కృతజ్ఞతలతో!!

ఇట్లు
మీ విధేయులు
మాజీ సర్పంచులు
కేసముద్రం & ఇనుగుర్తి మండలాలు

N. Yaiah [Komatipally]
(Lakh thanda)
[Patha thanda]
[Tharisingthanda]
P. murali (mahmood pham)
B. Srinivas (Thouraya Thanda)

దారిలో వెళ్లాల్సిన దుస్థితి తీసుకొస్తారా?" అంటూ వారు కన్నీటిపర్యంతమయ్యారు. **అధికారులకు, ప్రభుత్వానికి విజ్ఞప్తి!** కొత్త ప్రభుత్వమైనా తమ బాధలను అర్థం చేసుకుని రావలసిన ఎస్డీఎఫ్ నిధులను తక్షణమే విడుదల చేయాలని కోరుతూ జిల్లా అడిషనల్ కలెక్టర్ కే. అనిల్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం స్పందించి బకాయిలు చెల్లించకపోతే మాజీ సర్పంచుల కుటుంబాలు వీధిన పడటం ఖాయమని, తక్షణమే ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని నిధులు విడుదల చేయాలని కేసముద్రం, ఇనుగుర్తి మండలాల నేతలు 'తొలి అక్షరం' ద్వారా డిమాండ్ చేస్తున్నారు.

# ప్రజల అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

**- అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్**

**ప్రజావాణిలో 203 దరఖాస్తుల స్వీకరణ**

**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో, అక్టోబర్ 12:** ప్రజావాణిలో ప్రజలు సమర్పించిన అర్జీలను పరిశీలించి, సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు పురుషోత్తం, కె. అనిల్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి నాగలక్ష్మితో కలిసి ప్రజల నుంచి వినతులను స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు సమర్పించిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా త్వరగా పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణిలో భూ సమస్యలు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, రోడ్డు విస్తరణకు సంబంధించిన ఫిర్యాదులు అందాయి.



మహబూబాబాద్ గుమ్ముడూరుకు చెందిన అవారి నిర్మల తనకు సర్వే నంబర్ 36/Aలో ఉన్న ఒక ఎకరం 19 గుంటల పట్టా భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించి పట్టా ఇప్పించాలని కోరారు. కురవి మండలం బలపాల గ్రామానికి చెందిన దేసంగి మహాలక్ష్మి తాను 20 ఏళ్లుగా రేకుల ఇంట్లో నివసిస్తున్నానని, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కేసముద్రం మండలం పెనుగొండకు చెందిన పురుషోత్తం రెడ్డి గ్రామ రోడ్డు విస్తరణలో భాగంగా తన స్థలంలోకి నోటీసుల్లో పేర్కొన్న దానికంటే ఎక్కువగా ఆక్రమించి పనులు చేపడుతున్నారని ఫిర్యాదు చేసి, న్యాయం చేయాలని కోరారు.ప్రజావాణిలో జిల్లా కేంద్రంలో 119, డివిజన్ కేంద్రంలో 3, మండలాల్లో 81 చొప్పున మొత్తం 203 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. ఆయా అర్జీలను పరిశీలించి పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మధుసూధనరాజు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నితీష్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రవిరాథోడ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# కట్టంగూరులో విషాదం - కరెంట్ లైన్ మెన్ మృతి



**తొలి అక్షరం/రామన్నపేట అక్టోబర్ 12:** కట్టంగూరు మండలానికి చెందిన ముక్కాముల వెంకన్న యాదవ్ టీజీఎస్పీడీసీఎల్ కరెంట్ లైన్ మెన్) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దైద రవీందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గార్లపాటి రవీందర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సుంకరబోయిన నరసింహ యాదవ్, సర్పంచ్ ముక్కామల శేఖర్ యాదవ్, మాజీ ఎంపీటీసీ సత్తయ్య, యూత్ కాంగ్రెస్ నాయకుడు లక్ష్మీనారాయణ గౌడ్, కాంగ్రెస్ నాయకులు వీరయ్య, శ్రీను, గోపి తదితరులు పాల్గొన్నారు.



# రామన్నపేట మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి

- పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి:

**రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి**



**తొలి అక్షరం/రామన్నపేట అక్టోబర్ 12:** అకాల వర్షాలు తగ్గిపోవడం, వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని, రామన్నపేట మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి ప్రత్యేక నిధులు కేటాయించాలని రైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ లాల్ బహదూర్‌కు వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి మాట్లాడుతూ మండలంలో వరి, పత్తి తదితర పంటలు సాగు చేసిన రైతులు వర్షాభావ పరిస్థితుల వల్ల తీవ్రంగా నష్టపోయారని అన్నారు.పంటల సాగు కోసం పెట్టుబడులు పెట్టి, ఆశించిన దిగుబడులు రాక రైతులు అప్పుల పాలై దిక్కుతోచని స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల కష్టాలను ప్రభుత్వం గుర్తించి తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని కోరారు.పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని, రామన్నపేట మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి ప్రత్యేక నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతులు ఇప్పటికే తీసుకున్న పంట రుణాలను రీషెడ్యూల్ చేయాలని, ఎలాంటి కొర్రీలు పెట్టకుండా అర్హులైన రైతులందరికీ కొత్త పంట రుణాలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.రైతుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి, తక్షణమే స్పందించి రైతులకు న్యాయం చేయాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు బోయిని ఆనంద్,గన్నెబోయిన విజయభాస్కర్, మండల నాయకులు గొరిగే సోములు, ఎండీ రషీద్, వేముల సైదులు, మునికుంట్ల లెనిన్, గంటెపాక శివ కుమార్, మేడి ముకుంద,శానగొండ రాము, పుట్టల ఉదయ్ కుమార్, అవనగంటి రవి తదితరులు పాల్గొన్నారు.

# కుష్ఠువ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి

**జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్**

**ప్రారంభ దశలో గుర్తిస్తే**

**అంగవైకల్యాన్ని నివారించవచ్చు..**

**ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచిత చికిత్స**




**తొలి అక్షరం/ఖమ్మం, జిల్లా ప్రతినిధి అక్టోబర్ 12:** కుష్ఠువ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో కుష్ఠువ్యాధి నిర్మూలనపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 22 నుంచి నవంబర్ 4 వరకు జిల్లాలో కుష్ఠువ్యాధి గుర్తింపు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది గ్రామాలు, పట్టణాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు అనుమానిత లక్షణాలు ఉన్నవారిని గుర్తించి వైద్య పరీక్షలకు పంపిస్తారని పేర్కొన్నారు. చర్మంపై తెలుపు, ఎరుపు లేదా రాగి రంగులో మచ్చలు ఏర్పడి, వాటి వద్ద స్పర్శజ్ఞానం తగ్గడం కుష్ఠువ్యాధి ముఖ్య లక్షణమని తెలిపారు. ఇలాంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ప్రారంభ దశలో వ్యాధిని గుర్తించి, వైద్యుల సూచనల మేరకు పూర్తిస్థాయి చికిత్స తీసుకుంటే అంగవైకల్యాన్ని నివారించవచ్చన్నారు. కుష్ఠువ్యాధి శాపం వల్ల వచ్చేది కాదని, దీనిపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించాలని కలెక్టర్ పేర్కొన్నారు. వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపకుండా గౌరవంగా చూడాలని కోరారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ఎండీటీ బహుళ ఔషధ చికిత్స ఉచితంగా అందుబాటులో ఉందని, చికిత్సతో వ్యాధిని నయం చేసుకోవచ్చని తెలిపారు. జిల్లాలో కుష్ఠు వ్యాధి నిర్మూలనకు విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టి, అనుమానితులను ముందుగానే గుర్తించి వైద్య సేవలు అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి రామ్మూర్తి, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ రామారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బతుకమ్మ విగ్రహాల ధ్వంసం హేయమైన చర్య: డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్

- దాట్ల గ్రామ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలి
- నిందితులు ఏ పార్టీ వారైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలి




**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ అక్టోబర్ 12:** దంతాలపల్లి మండలం దాట్ల గ్రామంలో బతుకమ్మ విగ్రహాలను ధ్వంసం చేయడాన్ని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్ తీవ్రంగా ఖండించారు. బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీక అని, విగ్రహాలను ధ్వంసం చేయడం తెలంగాణ సంస్కృతిపై దాడిగా భావించాలని పేర్కొన్నారు. రాజకీయ విభేదాలను రాజకీయంగానే పరిష్కరించుకోవాలని, ఇలాంటి ఘటనలకు పాల్పడటం తగదన్నారు. పోలీసులు ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి, నిందితులు ఏ పార్టీకి చెందిన వారైనా గుర్తించి వెంటనే అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి సత్వరమే పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.



**తొలి అక్షరం/ఖమ్మం, జిల్లా ప్రతినిధి అక్టోబర్ 12:** ప్రజావాణిలో ప్రజల నుంచి అందిన ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, ట్రైనీ కలెక్టర్ పారస్ కుమార్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారులు పరిశీలించి, నిబంధనల ప్రకారం పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ముదిగొండ మండలం మల్లన్నపాలెం గ్రామానికి చెందిన ఎస్.కే. జాన్ బీ తన సదరం ధ్రువపత్రంలో తప్పుడు వివరాల కారణంగా దివ్యాంగుల పింఛన్ నిలిచిపోయిందని, తిరిగి పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. దీనిపై పరిశీలించి చర్యలు తీసుకోవాలని డీఆర్డీఓను కలెక్టర్ ఆదేశించారు. పదో తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ పేరుతో ముందస్తు ఇంటర్మీడియట్ ప్రవేశాలు నిర్వహిస్తున్న వేదాంత లెర్నింగ్ సెంటర్‌పై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ అధ్యక్షుడు టి. లక్ష్మణ్ ఫిర్యాదు చేశారు. ఈ అంశాన్ని పరిశీలించి నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. ఏదులాపురం పట్టణానికి చెందిన ఎస్.కే. ఆఫ్సానా తాను ఎంబీఏ పూర్తి చేశానని, తన విద్యార్హతలకు తగిన ఉపాధి కల్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఆమెకు ఉపాధి అవకాశాలపై పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఉపాధి అధికారికి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి రామ్మూర్తితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎర్రజెండా బాటలో నడిచిన నాయకుడికి ఘన నివాళి





**తొలి అక్షరం/రామన్నపేట అక్టోబర్ 12:** జీవితాంతం ఎర్రజెండానే ఊపిరిగా బతికిన సీపీఐ(ఎం) సీనియర్ నాయకుడు తొలుపునూరి భాషయ్య 6వ వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులు ఘన నివాళులర్పించారు. పేద ప్రజల పక్షాన, కార్మిక వర్గ హక్కుల కోసం చివరి శ్వాస వరకు పోరాడిన బషయ్య సేవలను గుర్తు చేసుకున్నారు. ఆయన చూపిన బాటలోనే ఆయన కుమారుడు తొలుపునూరి చంద్రశేఖర్ పార్టీలో కొనసాగుతూ వారసత్వాన్ని నిలబెడుతున్నారని పలువురు కొనియాడారు.

## ఎన్నారంలో రెండో రోజు గాయత్రీ దేవి అలంకారంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు

**తొలి అక్షరం/రామన్నపేట అక్టోబర్ 12:** రామన్నపేట మండలం ఎన్నారంగ్రామంలోని దుర్గమ్మ ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు అమ్మవారు గాయత్రీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చి పూజలు అందుకున్నారు. ఈ పూజా కార్యక్రమంలో కొండూరు శంకర్, చల్ల నరేష్, జల్లా పరమేష్, హరి ప్రసాద్, రమ్య, వైష్ణవి, వసంత, సురేష్ దంపతులు మరియు నాగరాజు దంపతులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారి దర్శనం చేసుకున్నారు.



## సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా రైతు నేస్తం కార్యక్రమం



**తొలి అక్షరం/రామన్నపేట అక్టోబర్ 12:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు నేడు రాష్ట్రవ్యాప్తంగా రైతు నేస్తం కార్యక్రమాన్ని నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో సమావేశమై పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఎల్నినో ప్రభావంతో వాతావరణంలో వచ్చే మార్పులు, రబీ సీజన్ పై దాని ప్రభావం, ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా చేపట్టాల్సిన పంటల సాగు విధానం, పంటల ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు వివరించారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తగిన పంటలను ఎంపిక చేసుకోవాలని, వ్యవసాయ శాఖ సూచనలను పాటిస్తూ సాగు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. రామన్నపేట గ్రామంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమానికి మండల స్పెషల్ ఆఫీసర్ రాఘవ రెడ్డి, తహసీల్దార్ లాల్ బహదూర్, ఎంపీడీవో రాములు, ఎంపీవో రఫీ, ఇరిగేషన్ ఏఈలు రాజేశ్వరి, సుచరిత, ఏపీవో వెంకన్న, ఏపీఎం జానీ, ఏఈఓలు ఎం. శ్రీనివాస్, పి. శ్రీనివాస్, కీర్తన, రైతులు పాల్గొన్నారు.

## చేగూర్‌లో ఘనంగా దుర్గమ్మకు ప్రత్యేక పూజలు

- అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలి..

**మాజీ ఎంపీపీ ప్రియాంక శివశంకర్ గౌడ్ దంపతులు**



**తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 12:** నందిగామ: దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం చేగూర్ గ్రామంలోని దుర్గమ్మ మండపం వద్ద వార్డు సభ్యురాలు సోలిపేట విఘ్నేశ్వరి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మండలాల మాజీ ఎంపీపీ మంచనపల్లి ప్రియాంక శివశంకర్ గౌడ్ దంపతులు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. గ్రామ ఉపసర్పంచ్ ఆవులమంద శివశంకర్, మండల యువజన అధ్యక్షుడు వెంకట్ చారి, పూజారి మల్లికార్జున్, భవానీలు, భక్తులు, గ్రామస్థులు, యువకులు తదితరులు పాల్గొన్నారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు.

## రైతుల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- ఎండుతున్న పంటలకు పరిహారం చెల్లించాలి:

**ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, అంజయ్య యాదవ్**



**తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 12:** రాష్ట్రంలో ఎరువుల కొరత, విద్యుత్ కోతలు, వర్షాభావ పరిస్థితులతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ విమర్శించారు. సోమవారం రంగారెడ్డి జిల్లా కొందుర్గులో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. తెలంగాణ ప్రయోజనాలను కాపాడటంలో ముఖ్యమంత్రి విఫలమయ్యారని విమర్శించారు. పార్టీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి నష్ట వివరాలను నమోదు చేయాలని కోరారు. పంటలు నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. ఈ సమావేశంలో కొందుర్గు సర్పంచ్ చౌడపురం ప్రభాకర్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అపరిష్కృత సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి



**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో, అక్టోబర్ 12:** పట్టణంలోని 22, 23వ వార్డుల్లో నెలకొన్న అపరిష్కృత సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి చింతకుంట్ల వెంకన్న కోరారు. సోమవారం సీపీఐ వార్డు కమిటీల ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఏఓకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ, వార్డుల్లో రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించి, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. పారిశుధ్య సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, సింగు నరసయ్య కాలనీ వెనుక రహదారిని శుభ్రం చేయాలని పలుమార్లు కోరినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కొండపల్లి గోపాల్‌రావు నగర్, సింగు నరసయ్య, దాసరి వెంకటరాములు, ఎన్జీవోస్, మాస బత్తిని వెంకటమల్లు, 551 మిలిటరీ కాలనీల్లో పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరించి వీధి దీపాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే వివిధ మతాల శ్మశాన వాటికల వద్ద పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరించాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో సీపీఐ శాఖ కార్యదర్శులు నాగేల్లి యాకమ్మ, ఎర్రోజు పద్మ, బల్లెం శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

## ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ రూ.64 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం



**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో, అక్టోబర్ 12:** వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని పురపాలక సంఘ చైర్‌పర్సన్ గుగులోత్ జ్యోతి రమేష్ తెలిపారు. సోమవారం పట్టణంలోని 20వ వార్డు పత్తిపాకలో రూ.64 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనుల వివరాలను వెల్లడించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. వార్డులో ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించి, సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, ఓడిపోయినప్పటికీ ప్రజల మధ్య ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్న స్థానిక కాంగ్రెస్ నాయకుడు హతిరాం నాయక్‌కు ప్రజలు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం. వినోద్ కుమార్, కౌన్సిలర్ బానోత్ భాస్కర్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అజ్మీర సురేష్ నాయక్, డీఈ ఉపేందర్, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజల కన్నీళ్లు తుడిచే అవకాశం పోలీసులకే ఉంది: డీజీపీ సీవీ ఆనంద్










**● తెలంగాణ పోలీస్ అకాడమీలో 112 మంది డీఎస్పీల పాసింగ్ అవుట్ పరేడ్ ● పోలీసు యూనిఫాం ధరించడం గొప్ప అదృష్టం ● నాయకత్వం,నైతిక విలువలు,సాంకేతిక పరిజ్ఞానంపై డీజీపీ దిశానిర్దేశం ● నేరాల తీరు మారింది..పోలీసింగ్ మారాలి ● ప్రజలకు నిజాయతీగా,రాగద్వేషాలకు అతీతంగా సేవలందించాలి ● పాసింగ్ అవుట్ పరేడ్ లో చేసిన ప్రమాణాన్ని ఎప్పుడూ గుర్తుంచుకోవాలి ● విధులు ఫిట్‌నెస్, స్మార్ట్‌నెస్ తప్పనిసరి: డీజీపీ సీవీ ఆనంద్**

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),అక్టోబర్12:** పోలీసు యూనిఫాం ధరించడం గొప్ప అదృష్టమని, ప్రజలకు సేవ చేయడంతోపాటు వారి ప్రాణాలను కాపాడే అరుదైన అవకాశం పోలీసు శాఖలో పనిచేసేవారికి లభిస్తుందని డీజీపీ సీవీ ఆనంద్ అన్నారు. తెలంగాణలో నాలుగు కోట్ల జనాభాలో సుమారు 90 వేల మందికే పోలీసు యూనిఫాం ధరించే అవకాశం ఉందని, ఇది మొత్తం జనాభాలో 0.3 శాతం మాత్రమేనని వివరించారు. ప్రతిరోజూ కనీసం 50 మంది కన్నీళ్లు తుడిచే అవకాశం పోలీసులకు ఉంటుందని పేర్కొన్నారు. నిజాయితీ, నైతిక విలువలను విస్మరించరాదని, కుల, మత, రాజకీయ రాగద్వేషాలకు అతీతంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. తెలంగాణ పోలీసు అకాడమీలో శిక్షణ పూర్తి చేసుకున్న 112 మంది డీఎస్పీల పాసింగ్ అవుట్ పరేడ్ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2014 తర్వాత పూర్తిస్థాయిలో శిక్షణ ముగించుకుని బయటకు వస్తున్న తొలి డీఎస్పీ బ్యాచ్ కావడంతో దీనికి ప్రత్యేకత ఉందన్నారు. 44 వారాలపాటు చట్టాలు, దర్యాప్తు విధానాలు, ఔట్‌డోర్ శిక్షణ, క్రీడల్లో శిక్షణ పొందిన అధికారులను అభినందించారు. శిక్షణలో ప్రతిభ కనబరిచిన వారిని ప్రశంసిస్తూ, అకాడమీ అధికారులు, అధ్యాపకులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. కొన్ని కారణాల వల్ల ముఖ్యమంత్రి పాసింగ్ అవుట్ పరేడ్‌కు హాజరు కాలేకపోతున్నట్లు తెలిపారని పేర్కొన్నారు. **30 ఏళ్ల వృత్తి జీవితానికి పునాది:** పాసింగ్ అవుట్ పరేడ్ సందర్భంగా చేసే ప్రమాణం అధికారుల 3035 ఏళ్ల వృత్తి జీవితానికి మార్గదర్శకంగా నిలవాలని డీజీపీ సూచించారు. రాజ్యాంగం పట్ల నిబద్ధతతో, ప్రజలకు నిజాయతీగా, రాగద్వేషాలకు అతీతంగా విధులు నిర్వహిస్తానని చేసిన ప్రమాణాన్ని ఎప్పుడూ గుర్తుంచుకోవాలన్నారు. అకాడమీలో శిక్షణ పూర్తయిన తర్వాత మరో 46 వారాలపాటు క్షేత్రస్థాయిలో శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈ దశలోనూ అదే శ్రద్ధ, క్రమశిక్షణ, నిజాయతీతో వ్యవహరించాలని సూచించారు. తన 35 ఏళ్ల పోలీసు అనుభవంలో నేర్చుకున్న అంశాలను గతంలో డీఎస్పీలతో నిర్వహించిన ముఖాముఖిలో వివరించానని, నాయకత్వ లక్షణాల ప్రాధాన్యాన్ని మరోసారి గుర్తుచేస్తున్నానని చెప్పారు. **నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి: డీజీపీ** ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. మీరు నాయకులుగా ఎంపికయ్యారు..మీ నాయకత్వ లక్షణాలను విధుల్లో నిరూపించుకోవాలని అన్నారు. ధైర్యం, దార్శనికత, నైతిక విలువలు, నిష్పాక్షికత, బృంద స్ఫూర్తి, సంభాషణ నైపుణ్యాలు, కష్టపడే తత్వం, సాంకేతిక పరిజ్ఞానం, నూతన ఆలోచనలు, వినయం.. ఈ పది లక్షణాలను ప్రతి అధికారి అలవర్చుకోవాలని సూచించారు. విధుల నిర్వహణలో నైతిక విలువలను ఎట్టి పరిస్థితుల్లోనూ విస్మరించరాదన్నారు. **నేరాల తీరు మారింది.. పోలీసింగ్ మారాలి:** తాము యూనిఫాం ధరించిన రోజుల్లో నక్సలిజం ప్రధాన సవాలుగా ఉండేదని, ఆ సమస్యను పోలీసులు సమర్థంగా ఎదుర్కొన్నారని డీజీపీ గుర్తుచేశారు. ప్రస్తుతం సైబర్ నేరాలు, వ్యవస్థీకృత నేరాలు, రోడ్డు భద్రత, ఇతర కొత్త తరహా సవాళ్లు పోలీసుల ముందున్నాయని తెలిపారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పోలీసు శాఖలో సంస్థాగత మార్పులు చేపట్టామని చెప్పారు. గ్రేహౌండ్స్ తదితర విభాగాల పునర్వ్యవస్థీకరణతోపాటు ఈగల్ ఫోర్స్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో, టీజీ ఫాస్ట్, టీజీ స్పార్క్ వంటి విభాగాలను బలోపేతం చేసి కొత్త సవాళ్లను ఎదుర్కొనేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. క్షేత్రస్థాయిలో పనిచేసే అధికారులు కూడా ఈ మార్పులకు అనుగుణంగా సిద్ధంగా ఉండాలని సూచించారు. **ఫిట్‌నెస్, స్మార్ట్‌నెస్ తప్పనిసరి:** పోలీసు శాఖలో శారీరక దారుఢ్యం, చురుకుదనం, వృత్తిపరమైన నైపుణ్యాలు అత్యంత ముఖ్యమని డీజీపీ అన్నారు. యూనిఫాం ధరించిన తొలిరోజు ఉన్న ఉత్సాహం, క్రమశిక్షణ, ఫిట్‌నెస్ 30 ఏళ్ల తర్వాత కూడా కొనసాగాలని ఆకాంక్షించారు. పోలీసు పాసింగ్ అవుట్ పరేడ్‌లో బెల్టుపై ఉన్న హోల్ (రంధ్రం) 30 ఏళ్ల సర్వీసు పూర్తయ్యే వరకు, ఉద్యోగ విరమణ చేసేంతవరకు అలాగే ఉండాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలందిస్తూ, సమర్థవంతమైన నాయకులుగా ఎదగాలని డీఎస్పీలకు పిలుపునిచ్చారు. **112 సంఖ్యకు ప్రత్యేక అనుబంధం: అకాడమీ డైరెక్టర్** తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్ మాట్లాడుతూ.. 112 సంఖ్యకు ప్రత్యేక ప్రాధాన్యం ఉందన్నారు. ప్రజల అత్యవసర సేవల కోసం తెలంగాణ పోలీసు వ్యవస్థలో 112 సేవలు అందుబాటులో ఉన్నాయని, ఇప్పుడు 112 మంది డీఎస్పీలు ప్రజా సేవలోకి అడుగుపెట్టడం విశేషమని పేర్కొన్నారు. వీరిలో 74 మంది పురుషులు, 38 మంది మహిళలు ఉన్నారు. మల్టీజోన్-1 నుంచి 51 మంది, మల్టీజోన్-2 నుంచి 61 మంది ఎంపికయ్యారు. విద్యార్హతల పరంగా 79 మంది డిగ్రీ పట్టభద్రులు, 31 మంది పీజీ పూర్తి చేసినవారు ఉన్నారు. మరో ఇద్దరిలో ఒకరు ఎంబీబీఎస్, మరొకరు బీడీఎస్ పట్టా పొందారు. ఈ బ్యాచ్‌లో గతంలో రాష్ట్ర ప్రభుత్వంలో పనిచేసినవారు 45 మంది, కేంద్ర ప్రభుత్వంలో పనిచేసినవారు 12 మంది ఉండగా.. కొత్తగా ఉద్యోగ జీవితంలోకి అడుగుపెడుతున్నవారు 55 మంది ఉన్నారు. గతంలో పోలీసు శాఖలో ఎస్సైలుగా పనిచేసిన నలుగురు ప్రస్తుతం డీఎస్పీలుగా ఎంపికయ్యారు. శిక్షణ పొందుతూనే 2026లో యూపీఎస్సీ పరీక్షల్లో జి.సృజన 55వ ర్యాంకు, డి.ప్రవీణ్‌కుమార్ 795వ ర్యాంకు సాధించడం విశేషం. ఆరు వారాల ఫౌండేషన్ శిక్షణను డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో అందించినట్లు చెప్పారు. అకాడమీ నినాదమైన నాలెడ్జ్, స్కిల్, ఆటిట్యూడ్ ఆధారంగా అధికారులకు శిక్షణ ఇచ్చామని తెలిపారు. క్షేత్రస్థాయి అనుభవం కల్పించేందుకు మేడారం జాతర, వినాయక చవితి, ఇతర ప్రధాన కార్యక్రమాల్లో విధులు నిర్వహించే అవకాశం కల్పించామన్నారు. సైబర్ సెక్యూరిటీ బ్యూరో, ఈగల్ వంటి విభాగాలతో శిక్షణ ఇచ్చినట్లు వివరించారు. పోలీసుల విధి ప్రజలకు న్యాయం చేయడమేనని, వారి పనితీరును బట్టే ప్రజలు వారిని అంచనా వేస్తారని అన్నారు. **నేహా అగర్వాల్‌కు సీఎం రివాల్వర్-9 విభాగాల్లో ఉత్తమ ప్రతిభకు ట్రోఫీలు, పతకాలు** పోలీస్ శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన నేహా అగర్వాల్ ముఖ్యమంత్రి రివాల్వర్‌తో పాటు మరో మూడు పురస్కారాలను అందుకున్నారు. బెస్ట్ ఆల్‌రౌండ్ పెర్ఫార్మెన్స్‌కు సీఎం రివాల్వర్, రాజా బహదూర్ వెంకట రామారెడ్డి బంగారు పతకం, కోన రామచంద్రారెడ్డి స్మారక బంగారు పతకం, ఇండోర్ సబ్జెక్టుల్లో ప్రతిభకు హోంమంత్రి బేటన్ ఆమెకు లభించాయి. రాజా బహదూర్ వెంకట రామారెడ్డి బంగారు పతకంతో పాటు రూ.5,000 నగదు బహుమతి కూడా అందుకున్నారు. ఇతర విభాగాల్లో ప్రతిభ కనబరిచిన వారిలో ఔట్‌డోర్ సబ్జెక్టుల్లో ఎల్. శ్రీకాంత్ డీజీపీ ట్రోఫీ, ఫైరింగ్‌లో టి. జాకబ్ అభిషేక్ ఉత్తమ పురస్కారం అందుకున్నారు. ఫోరెన్సిక్ సైన్స్‌లో డి. చందన, క్రిమినాలజీలో చి. ఆది శేషు రెడ్డి ఎన్ఐసీఎఫ్ఎస్ పతకాలు సాధించారు. దర్యాప్తులో ఉత్తమ ప్రతిభకు ఆర్. సాయి కిరణ్ రెడ్డి డైరెక్టర్ పతకాన్ని దక్కించుకున్నారు. **చట్టాల నుంచి సైబర్ నేరాల దర్యాప్తు వరకు:** 44 వారాల సంస్థాగత శిక్షణలో భాగంగా ఇండోర్, అవుట్‌డోర్ అంశాలను రెండు సెమిస్టర్లుగా విభజించారు. ఇండోర్ శిక్షణలో పోలీసు వ్యవస్థ, నేరశాస్త్రం, నేరాల నివారణ, మానవ హక్కులు, భారతీయ న్యాయ సంహిత, భారతీయ సాక్ష్య అధినియం, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, ఫోరెన్సిక్ సైన్స్, నాయకత్వం, నిర్వహణ వంటి అంశాలను బోధిస్తున్నారు. శారీరక నేరాలు, ఆస్తి సంబంధ నేరాలు, సైబర్ నేరాలు, ఆర్థిక మోసాల దర్యాప్తు విధానాలపైనా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. అంతర్గత భద్రత, శాంతిభద్రతల నిర్వహణపై అవగాహన కల్పిస్తున్నారు. **ఆయుధ వినియోగం.. క్షేత్రస్థాయి నైపుణ్యాలు:** అవుట్‌డోర్ శిక్షణలో శారీరక వ్యాయామాలు, డ్రిల్, పరేడ్, ఆయుధ వినియోగం, కాల్పులు, ఫీల్డ్‌క్రాఫ్ట్, మ్యాప్ రీడింగ్, వ్యూహాత్మక విధానాలు, వీఐపీ భద్రత, పేలుడు పదార్థాలు, ఐఈడీల నిర్వహణ వంటి అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. స్విమ్మింగ్, ప్రథమ చికిత్స, అంబులెన్స్ డ్రిల్, వాహనాల డ్రైవింగ్, విపత్తుల నిర్వహణ, అగ్నిమాపక చర్యలు, క్రీడలకూ ప్రాధాన్యం ఇచ్చారు. పాసింగ్ అవుట్ పరేడ్‌లో సీనియర్ పోలీసు అధికారులు, రిటైర్డ్ పోలీసు అధికారులు, అకాడమీ సిబ్బంది, శిక్షణ పొందిన డీఎస్పీల కుటుంబ సభ్యులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.



# కొత్త పిచ్.. ఎలా స్పందిస్తుందో!

### ఎర్ర, నల్ల మట్టి మిశ్రమంతో పిచ్ సిద్ధం
### ఉప్పల్‌లో భారత్‌వెస్టిండీస్ నాలుగో టీ20.. భారీ స్కోర్లకు అవకాశం



**హైదరాబాద్:**భారత్, వెస్టిండీస్ టీ20 సిరీస్ భారీ స్కోర్లతో ఆసక్తికరంగా సాగుతున్న నేపథ్యంలో క్రికెట్ అభిమానుల దృష్టి హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంపై పడింది. ఈ సిరీస్‌లో నాలుగో టీ20 మ్యాచ్ బుధవారం ఉప్పల్‌లో జరగనుంది. సిరీస్‌ను గెలుచుకోవాలని భారత్ పట్టుదలతో ఉండగా, పోటీలో నిలిచి సిరీస్‌ను సమం చేయాలని వెస్టిండీస్ భావిస్తోంది. ఈ మ్యాచ్‌కు కొత్తగా రూపొందించిన పిచ్‌ను కేటాయించడంతో అది ఎలా స్పందిస్తుందన్న ఆసక్తి నెలకొంది. **15 ఏళ్ల తర్వాత కొత్త పిచ్‌లు**హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఉప్పల్ స్టేడియంలో సుమారు 15 ఏళ్ల తర్వాత పిచ్‌లను మార్చింది. గతంలో ఎర్రమట్టితో రూపొందించిన పిచ్‌లు ఉండగా, తాజాగా ఎర్రమట్టి, నల్లమట్టి మిశ్రమంతో కొత్త పిచ్‌లను సిద్ధం చేశారు. పిచ్‌లతోపాటు మైదానం వెలుపలి ప్రాంతాన్ని కూడా ఆధునీకరించే చర్యల్లో భాగంగా ఈ మార్పులు చేపట్టారు. కొత్త పిచ్‌పై భారత్‌వెస్టిండీస్ మ్యాచ్ జరగనుండటంతో బ్యాటింగ్, బౌలింగ్‌కు ఎలాంటి పరిస్థితులు అనుకూలిస్తాయన్నది చర్చనీయాంశంగా మారింది. **గతంలో పరుగుల వరద** ఉప్పల్ స్టేడియం భారీ స్కోర్లకు పేరుగాంచింది. ఇక్కడ జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌ల్లో సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్లు భారీ పరుగులు సాధించారు. 2024లో బంగ్లాదేశ్‌తో జరిగిన టీ20 మ్యాచ్‌లో భారత్ 297 పరుగులు నమోదు చేసింది. 2025 ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ 286 పరుగులు సాధించింది. ఈ నేపథ్యంలో కొత్త పిచ్ కూడా బ్యాటర్లకు అనుకూలించి మరోసారి భారీ స్కోర్లకు వేదికగా మారుతుందా అన్న ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. **బ్యాట్‌కు, బంతికి సమాన పోటీ ఉంటుందా?** ఎర్రమట్టి పిచ్‌లపై సాధారణంగా బ్యాటింగ్ అనుకూలంగా ఉంటుంది. తాజాగా రూపొందించిన మిశ్రమ మట్టి పిచ్‌లో ఎర్రమట్టి లక్షణాలతోపాటు నల్లమట్టి స్వభావం కూడా ఉండనుంది. దీనివల్ల బంతికి మంచి వేగం, బౌన్స్ లభించే అవకాశం ఉంది. బంతి కొత్తగా ఉన్నప్పుడు బౌలర్లకు సహకారం లభించవచ్చని, బంతి పాతబడిన తర్వాత బ్యాటర్లు పరుగులు సాధించేందుకు అనుకూల పరిస్థితులు ఏర్పడవచ్చని అంచనా. ఈ పిచ్‌పై కూడా 200కు పైగా పరుగులు నమోదయ్యే అవకాశాలున్నాయని క్రికెట్ వర్గాలు భావిస్తున్నాయి. **సిరీస్ విజయం కోసం ఇరు జట్ల పోరాటం** భారత్ సిరీస్ విజయంపై దృష్టి పెట్టగా, వెస్టిండీస్ సిరీస్‌ను సమం చేయాలనే లక్ష్యంతో బరిలోకి దిగనుంది. కొత్త పిచ్‌పై టాస్ కీలకం కానుందా? తొలుత బ్యాటింగ్ చేసిన జట్టు భారీ స్కోరు సాధిస్తుందా? లేక బౌలర్లు ఆధిపత్యం చెలాయిస్తారా? అన్న ప్రశ్నలకు మ్యాచ్‌లోనే సమాధానం లభించనుంది. కొత్త పిచ్ స్వభావం, ఇరు జట్ల వ్యూహాలు, బ్యాటర్ల దూకుడు ఉప్పల్ మ్యాచ్‌ను మరింత ఆసక్తికరంగా మార్చనున్నాయి.

# టీ20 సిరీస్ టైటిల్ స్పాన్సర్‌గా ముత్తూట్ ఫిన్‌కార్ప్

● భారత క్రికెట్‌తో మరింత చేరువయ్యే అవకాశం




**హైదరాబాద్:**భారత్, వెస్టిండీస్ మధ్య జరుగుతున్న టీ20 సిరీస్‌కు ముత్తూట్ ఫిన్‌కార్ప్ లిమిటెడ్ టైటిల్ స్పాన్సర్‌గా వ్యవహరిస్తోంది. బుధవారం హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో నాలుగో టీ20 మ్యాచ్ జరగనున్న నేపథ్యంలో ఈ ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ)తో కుదిరిన ఒప్పందం ప్రకారం భారత్‌లో జరిగే దేశవాళీ, అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లకు ఈ సంస్థ టైటిల్ స్పాన్సర్‌గా వ్యవహరించనుంది. ఈ సందర్భంగా ముత్తూట్ ఫిన్‌కార్ప్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ థామస్ జార్జ్ మాట్లాడుతూ, భారత ప్రజలకు మరింత చేరువయ్యేందుకు క్రికెట్ ఒక అర్థవంతమైన వేదికగా ఉపయోగపడుతుందని తెలిపారు. దేశవ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులను కలిపే క్రికెట్‌తో భాగస్వామ్యం తమ సంస్థకు ప్రత్యేక అవకాశమని పేర్కొన్నారు.బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్ మాట్లాడుతూ, భారత జట్టు స్వదేశీ సీజన్‌కు ముత్తూట్ ఫిన్‌కార్ప్ టైటిల్ స్పాన్సర్‌గా వ్యవహరించడం భారత క్రికెట్ విస్తృతి, ప్రజలతో దాని అనుబంధాన్ని ప్రతిబింబిస్తుందని అన్నారు. ఈ భాగస్వామ్యం ద్వారా క్రికెట్ అభిమానులతో సంస్థ అనుబంధం మరింత బలపడనుంది.

# గెలుపు ముంగిట హైదరాబాద్!

### త్రిపుర రెండో ఇన్నింగ్స్ 99/7.. మరో 61 పరుగుల వెనుకంజ
### ఇన్నింగ్స్ విజయంపై హైదరాబాద్ గురి



హైదరాబాద్:రంజీ ట్రోఫీ తొలి రౌండ్ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు ఇన్నింగ్స్ విజయానికి చేరువైంది. బౌలర్లకు అనుకూలిస్తున్న పిచ్‌పై హైదరాబాద్ బౌలర్లు విజృంభించడంతో త్రిపుర జట్టు రెండో ఇన్నింగ్స్‌లోనూ తడబడుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో 134 పరుగులకే కుప్పకూలిన త్రిపుర, రెండో ఇన్నింగ్స్‌లో 33 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 99 పరుగులు చేసింది. దీంతో హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యాన్ని అధిగమించేందుకు ఇంకా 61 పరుగులు చేయాల్సి ఉంది. మిగిలిన మూడు వికెట్లను త్వరగా పడగొట్టి ఇన్నింగ్స్ విజయంతో టోర్నీలో శుభారంభం చేయాలని హైదరాబాద్ జట్టు పట్టుదలతో ఉంది. **తొలి ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ ఆధిపత్యం**అంతకుముందు హైదరాబాద్ తన తొలి ఇన్నింగ్స్‌లో 294 పరుగులకు ఆలౌటై 160 పరుగుల కీలక ఆధిక్యాన్ని సాధించింది. బ్యాటర్లు సమష్టిగా రాణించడంతో జట్టు ప్రత్యర్థిపై పైచేయి సాధించింది. తన్మయ్ అగర్వాల్ 54 పరుగులతో అర్ధశతకం సాధించగా, రుతిక్ యాదవ్ 150 బంతుల్లో ఐదు ఫోర్లతో 61 పరుగులు చేసి జట్టుకు అండగా నిలిచాడు. సీవీ మిలింద్ 55 బంతుల్లో ఐదు ఫోర్లు, రెండు సిక్సర్లతో 40 పరుగులు సాధించాడు. రాహుల్ 119 బంతుల్లో 40 పరుగులు చేయగా, అనికెత్ రెడ్డి 20 పరుగులు చేశాడు. త్రిపుర బౌలర్లలో సందీప్ సర్కార్ అద్భుతంగా బౌలింగ్ చేసి ఎనిమిది వికెట్లు పడగొట్టాడు. అయినప్పటికీ హైదరాబాద్ బ్యాటర్లు కీలక పరుగులు సాధించడంతో జట్టు భారీ ఆధిక్యాన్ని అందుకుంది.

**రెండో ఇన్నింగ్స్‌లోనూ త్రిపురకు కష్టాలు** 160 పరుగుల లోటుతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన త్రిపుర బ్యాటర్లు హైదరాబాద్ బౌలర్లను ఎదుర్కోవడంలో ఇబ్బందులు పడ్డారు. వరుసగా వికెట్లు కోల్పోవడంతో జట్టు కష్టాల్లో పడింది. స్పిన్నర్ తనయ్ త్యాగరాజన్ మూడు వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి బ్యాటింగ్ క్రమాన్ని దెబ్బతీశాడు. కెప్టెన్ మహ్మద్ సిరాజ్ రెండు వికెట్లు తీసి తన వంతు పాత్ర పోషించాడు. రుతిక్ యాదవ్, అభిరాథ్ రెడ్డి చెరో వికెట్ సాధించి త్రిపురను మరింత ఒత్తిడిలోకి నెట్టారు. రెండో ఇన్నింగ్స్‌లో 99 పరుగులకే ఏడు వికెట్లు కోల్పోయిన త్రిపుర ఇంకా 61 పరుగుల వెనుకంజలో ఉండటంతో హైదరాబాద్ విజయం దాదాపు చేరువలో కనిపిస్తోంది. చివరి రోజు ఉదయం సెషన్‌లో మిగిలిన మూడు వికెట్లు త్వరగా తీస్తే ఇన్నింగ్స్ విజయాన్ని అందుకునే అవకాశం ఉంది.బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమష్టిగా రాణించిన హైదరాబాద్ జట్టు రంజీ ట్రోఫీలో తొలి విజయాన్ని నమోదు చేయాలని చూస్తోంది. తొలి ఇన్నింగ్స్‌లో సాధించిన ఆధిక్యం, రెండో ఇన్నింగ్స్‌లో బౌలర్ల ప్రదర్శన జట్టుకు కలిసొచ్చాయి. త్రిపుర మిగిలిన వికెట్లను కాపాడుకుంటూ లోటును అధిగమించేందుకు ప్రయత్నించనుండగా, హైదరాబాద్ బౌలర్లు మ్యాచ్‌ను త్వరగా ముగించాలనే లక్ష్యంతో బరిలోకి దిగనున్నారు. చివరి రోజు ఆటలో హైదరాబాద్ ఇన్నింగ్స్ విజయాన్ని అందుకుంటుందా అన్నది ఆసక్తికరంగా మారింది

# ఎంఎస్ఎల్ విజేత రేజింగ్ బుల్స్

### - ఫైనల్లో సన్‌క్రెస్ట్ వారియర్స్‌పై మూడు వికెట్లతో విజయం



మాస్టర్స్ సూపర్ క్రికెట్ లీగ్ (ఎంఎస్ఎల్) తొలి సీజన్ విజేతగా రేజింగ్ బుల్స్ నిలిచింది. ఆదివారం జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్లో సన్‌క్రెస్ట్ వారియర్స్‌పై మూడు వికెట్ల తేడాతో విజయం సాధించి టైటిల్‌ను కైవసం చేసుకుంది.తొలుత బ్యాటిం గ్ చేసిన సన్‌క్రెస్ట్ వారియర్స్ నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 157 పరుగులు చేసింది. రామ్ పాటిల్ 40 పరుగులతో రాణించాడు. రేజింగ్ బుల్స్ కెప్టెన్ హరీశ్ మూడు వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి జట్టు పరుగుల వేగాన్ని నియంత్రించాడు.అనంతరం 158 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన రేజింగ్ బుల్స్ 19.2 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 158 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది.
పవన్ చెరుకూరి 47 పరుగులతో కీలక ఇన్నింగ్స్ ఆడగా, ఓపెనర్ అబిద్ అజహరుద్దీన్ 41 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. సిరీస్ అంతటా నిలకడగా రాణించిన నీరజ్ ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా, ఫైనల్లో మూడు వికెట్లు తీసిన హరీశ్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.మాస్టర్స్ క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ లీగ్‌కు మంచి స్పందన లభించిందని అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.పి. రెడ్డి తెలిపారు. వచ్చే ఏడాది నుంచి రెండు సీజన్లు నిర్వహించడంతోపాటు, ఆటగాళ్ల ప్రదర్శన ఆధారంగా వేలం నిర్వహించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. వెటరన్ క్రికెటర్ల ప్రతిభను ప్రదర్శించేందుకు ఈ లీగ్ మంచి వేదికగా నిలిచిందని మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. భవిష్యత్తులో పోటీలను దక్షిణ మండల స్థాయి నుంచి దేశవ్యాప్తంగా విస్తరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

# టీసీఏతో గ్రామీణ క్రికెటర్లకు భరోసా!



### 32 జిల్లాల యువ ఆటగాళ్లకు అన్యాయం జరగకుండా పోరాటం
### అవసరమైతే బీసీసీఐ కార్యాలయం ఎదుట వేల మందితో ధర్నా: ధరం గురువారెడ్డి

హైదరాబాద్: తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లోని క్రికెటర్ల ప్రతిభను వెలికితీసి, వారికి సరైన శిక్షణ అందించి, రంజీ ట్రోఫీతో పాటు జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించే స్థాయికి తీర్చిదిద్దడమే తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టీసీఏ) ప్రధాన లక్ష్యమని ఆ సంఘం ప్రధాన కార్యదర్శి ధరం గురువారెడ్డి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో ప్రతిభ ఉన్నప్పటికీ, తగిన అవకాశాలు లభించక పలువురు యువ ఆటగాళ్లు వెనుకబడుతున్నారని ఆయన పేర్కొన్నారు.ఆదివారం వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయం మైదానంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-19 లీగ్ చాంపియన్‌షిప్ పోటీలను టీసీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయచందర్‌రెడ్డితో కలిసి గురువారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామీణ క్రికెటర్లకు అవకాశాలు కల్పించడం, వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం అవసరమని ఆయన స్పష్టం చేశారు.తెలంగాణలోని 32 జిల్లాల క్రికెటర్లకు తీవ్ర అన్యాయం జరుగుతోందని గురువారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ఎదిగే క్రీడాకారులకు సమాన అవకాశాలు కల్పించాలని, వారి ప్రతిభకు తగిన గుర్తింపు లభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. క్రికెట్‌లో ప్రతిభకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రాంతంతో సంబంధం లేకుండా అర్హులైన ఆటగాళ్లకు ముందుకు వెళ్లే అవకాశం కల్పించాలని అన్నారు.గ్రామీణ క్రికెటర్లకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించేందుకు అవసరమైతే భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కార్యాలయం ఎదుట వేల మందితో ధర్నా నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. గ్రామీణ ప్రాంత యువ ఆటగాళ్లకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో క్రికెట్ ప్రతిభను వెలికితీసి, యువ ఆటగాళ్లకు సరైన వేదిక కల్పించడమే లక్ష్యంగా టీసీఏ పనిచేస్తోందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# బోడుప్పల్ పరిసర ప్రాంతాల్లో నేడు విద్యుత్ అంతరాయం

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి పి సైదులు అక్టోబర్12:**
బోడుప్పల్ ప్రాంతంలో రానున్న కొత్త 33/11 కేవీ బీఎల్ నగర్ సబ్-స్టేషన్ ఏర్పాటు పనులు జోరుగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా ఇంద్రనగర్ 33/11 కేవీ సబ్-స్టేషన్ పరిధిలో అత్యవసర పనులను చేపట్టనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. టవర్ల నిర్మాణం, జంపర్ల మార్పిడి పనుల నిమిత్తం మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుంది. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి తదనుగుణంగా తమ పనులను సర్దుకోవాలని అధికారులు కోరారు. 1. ఉదయం 11నుండి మధ్యాహ్నం 2 వరకు ఫీడర్ వివరాలు: 11 కేవీ ఎస్‌బీఆర్ కాలనీ ఫీడర్ (33/11 కేవీ ఇంద్రనగర్ సబ్-స్టేషన్ పరిధి) **ప్రభావిత ప్రాంతాలు:** పద్మావతి కాలనీ, అమ్మసాని వెంకట్ రెడ్డి కాలనీ, ఆర్ఎన్ఎస్ కాలనీ, బీఎల్ నగర్, అంజయ్య ఎన్‌క్లేవ్, టెలిఫోన్ కాలనీ ఫేజ్-2, పీఎన్ఆర్ కాలనీ, రెడ్డిస్ కాలనీ, భవాని కాలనీ, శుభోదయ కాలనీ, లెక్చరర్స్ కాలనీ, గ్రీన్ సిటీ కాలనీ, అనగపురి కాలనీ, భీమ్‌రెడ్డి కాలనీ, ఎన్ఐఎన్ కాలనీ. 2. బ్యాక్ ఫీడింగ్ కొరకు (స్వల్ప సమయం మాత్రమే) జంపర్ల తొలగింపు మరియు పునరుద్ధరణ పనుల నిమిత్తం 11 కేవీ వివేకానంద ఫీడర్ పరిధిలో రెండు విడతలుగా కరెంట్ నిలిపివేయబడుతుంది. ఉదయం 11నుండి 11.15 వరకు మధ్యాహ్నం 2:45 నుండి 3వరకు ప్రభావిత ప్రాంతాలు: మణికంఠ నగర్, వివేకానంద నగర్, శ్రీ లక్ష్మీ నగర్, లెక్చరర్స్ కాలనీ, ఐఐసీటీ కాలనీ, భీమ్‌రెడ్డి కాలనీ, అశోక్ నగర్, గ్రీన్ సిటీ కాలనీ, అనగపురి కాలనీ, పనుల నిమిత్తం జరిగే ఈ విద్యుత్ అంతరాయానికి ప్రజలు, వినియోగదారులు సహకరించాలని బోడుప్పల్ విద్యుత్ శాఖ ఏఈ (ఆపరేషన్) ఎన్. వేణుగోపాల్ ఒక ప్రకటనలో కోరారు.

# మేధ, జై జాస్తి జంటగా

## మైత్రీ మూవీ మేకర్స్ కొత్త చిత్రం






టాలీవుడ్‌లో సీనియర్ నటుడు శ్రీకాంత్ కుమార్తె మేధ మేకా హీరోయిన్‌గా అరంగేట్రం చేస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై ఆసక్తి నెలకొంది. జై జాస్తి హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి 'మైత్రీ ఇన్ లవ్' అనే వర్కింగ్ టైటిల్‌ను పరిశీలిస్తున్నారు.

సోమవారం ఈ సినిమా పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా చిత్ర బృందం ఒక ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. "వారితో మొదలై, మీ హృదయాల్లో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకునే ప్రేమకథ ఇది" అనే వ్యాఖ్యతో ఈ పోస్టర్‌ను పంచుకుంది. ఇది ఒక అందమైన ప్రేమకథగా రూపుదిద్దుకోనుందని నిర్మాతలు తెలిపారు. ఈ చిత్రానికి పృథ్వీ వనం దర్శకత్వం వహిస్తుండగా, మహేశ్ బాబు. పి క్రియేటర్‌గా వ్యవహరిస్తున్నారు.

ఈ కొత్త సినిమా టైటిల్, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే అధికారికంగా వెల్లడించనున్నారు. కాగా, నేటి ముహూర్తం ఈవెంట్ కు టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, నటుడు శ్రీకాంత్ తదితరులు హాజరయ్యారు. దర్శకురాలు నందినిరెడ్డి ముహూర్తం షాట్ కు క్లాప్ కొట్టారు.

# అల్లు అర్జున్ తో మాట్లాడుతున్న ఫొటోను పంచుకున్న లోకేశ్

### "ఆసక్తికరమైన అప్‌డేట్స్ త్వరలోనే.." అంటూ క్యాప్షన్



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, దర్శకుడు లోకేశ్ కనగరాజ్ కాంబినేషన్‌లో రాబోతున్న సినిమా 'ఏఏ23'పై ఆసక్తికర అప్‌డేట్ వచ్చేసింది. ఈ ప్రాజెక్టు ఆగిపోయిందంటూ ఇటీవల ప్రచారం జరగ్గా.. దర్శకుడు లోకేశ్ తాజా పోస్టుతో ఆ ఊహాగానాలకు తెరదించారు. త్వరలోనే ఆసక్తికరమైన వివరాలు వెల్లడిస్తామని ప్రకటించారు.లోకేశ్ కనగరాజ్ సోమవారం తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో అల్లు అర్జున్‌తో మాట్లాడుతున్న ఫొటోను పంచుకున్నారు. "ఆసక్తికరమైన అప్‌డేట్స్ త్వరలోనే వస్తున్నాయి" అంటూ క్యాప్షన్ జత చేశారు. దీంతో ఈ సినిమాపై అభిమానుల్లో మళ్లీ అంచనాలు పెరిగాయి.అల్లు అర్జున్, లోకేశ్ కనగరాజ్ తొలిసారి కలిసి పనిచేయనున్నట్లు ఈ ఏడాది జనవరిలో అధికారికంగా ప్రకటించారు. ఆ సందర్భంగా విడుదల చేసిన వీడియో ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించింది. అందులో ఓ సింహం స్థిరంగా నిలబడగా.. దాని చుట్టూ కొన్ని నక్కలు తిరుగుతూ ఆధిపత్యం చెలాయించేందుకు ప్రయత్నిస్తాయి. ఈ వీడియో సినిమా కథ గురించి పెద్దగా వివరాలు వెల్లడించకపోయినా.. ప్రాజెక్టుపై భారీ అంచనాలు పెంచింది.'ఏఏ23'ను మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించనున్నారు. గతంలో అల్లు అర్జున్ నటించిన బ్లాక్‌బస్టర్ 'పుష్ప'ను కూడా ఈ నిర్మాణ సంస్థే తెరకెక్కించింది. అయితే 'ఏఏ23' కథ, ఇతర నటీనటులు, చిత్రీకరణ వివరాలపై అధికారికంగా మరింత సమాచారం రావాల్సి ఉంది.మరోవైపు అల్లు అర్జున్ ప్రస్తుతం దర్శకుడు అట్లీ తెరకెక్కిస్తున్న 'రాకా' చిత్రంతో బిజీగా ఉన్నారు. ఇందులో దీపికా పదుకొణె కథానాయికగా నటిస్తున్నారు. అల్లు అర్జున్, దీపికా తొలిసారి జంటగా కనిపించనున్న ఈ సినిమాపైనా అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ఏప్రిల్ 8న అల్లు అర్జున్ 44వ పుట్టినరోజు సందర్భంగా 'రాకా'ను అధికారికంగా ప్రకటించడంతో పాటు ఆయన ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు.ఇప్పుడు 'ఏఏ23'పై లోకేశ్ చేసిన తాజా ప్రకటనతో ఈ ప్రాజెక్టు ఎప్పుడు పట్టాలెక్కుతుందా? ఎలాంటి కథతో ప్రేక్షకుల ముందుకు వస్తుందా? అన్న ఉత్కంఠ మొదలైంది.

# నా జీవితంలో చేసిన అతిపెద్ద ప్రయోగం అదే..

### ఆసక్తికర విషయాలు చెప్పిన రాజమౌళి





దర్శకధీరుడు ఎస్ఎస్ రాజమౌళి కెరీర్‌లో 'బాహుబలి'కి ప్రత్యేక స్థానం ఉంది. ఈ సినిమాతో ఆయన పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు సంపాదించగా, 'ఆర్ఆర్ఆర్'తో అంతర్జాతీయ ప్రేక్షకులకు మరింత చేరువయ్యారు. అయితే తనకు అత్యంత సంతృప్తినిచ్చిన సినిమా మాత్రం 'బాహుబలి' కాదని రాజమౌళి వెల్లడించారు. తనలో నిజమైన ఆత్మవిశ్వాసాన్ని నింపిన చిత్రం 'ఈగ' అని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

సూపర్‌స్టార్ మహేశ్ బాబుతో కలిసి రాజమౌళి తెరకెక్కిస్తున్న 'వారణాసి' ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. ఈ నేపథ్యంలో ఓ ప్రముఖ మీడియా ఛానల్‌తో మాట్లాడిన ఆయన తన సినీ ప్రయాణానికి సంబంధించిన పలు విషయాలను పంచుకున్నారు. ప్రేక్షకులు తన కెరీర్‌ను 'బాహుబలి'కి ముందు, తర్వాత అని విభజించి చూస్తారని, కానీ తన దృష్టిలో మాత్రం 'ఈగ'కు ముందు, తర్వాత అనే విభజన ఉంటుందని తెలిపారు.'ఈగ' తన కెరీర్‌లో చేసిన అతిపెద్ద ప్రయోగమని రాజమౌళి చెప్పారు. ఒక ఈగను ప్రధాన పాత్రగా తీసుకుని, దాని చుట్టూ భావోద్వేగాలతో కూడిన కథను నడిపించడం తనకు ఎంతో ప్రత్యేకమైన అనుభవమని వివరించారు. ఆ సినిమా తనకు అందించిన సంతృప్తి మాటల్లో చెప్పలేనిదని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఎన్ని సినిమాలు తీసినా 'ఈగ' తనకు ఎప్పటికీ ప్రత్యేకంగానే ఉంటుందని స్పష్టం చేశారు.రాజమౌళి వ్యాఖ్యలు ప్రస్తుతం సినీ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. భారీ స్థాయి చిత్రాలతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు, తనకు వ్యక్తిగతంగా ఎంతో తృప్తినిచ్చిన సినిమాగా 'ఈగ'ను పేర్కొనడం విశేషం. మరోవైపు మహేశ్ బాబుతో రూపొందిస్తున్న 'వారణాసి'పై కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి.



# అసలు ఊహించలేదు..

### జడ్జిగా అవకాశం రావడంపై అనుపమ కామెంట్స్!

టాలీవుడ్ టాలెంటెడ్ బ్యూటీ అనుపమ పరమేశ్వరన్ ప్రస్తుతం వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నారు. తెలుగుతో పాటు ఇతర భాషల్లోనూ నటిస్తూ అదరగొడుతున్న ఆమె, త్వరలోనే 'క్రేజీ కల్యాణం' సినిమాతో అక్టోబర్ 16న ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ సినిమా ప్రమోషన్లలో బిజీగా ఉన్న అనుపమ, ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పాల్గొని తన కెరీర్‌కు సంబంధించిన ఎన్నో ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ముఖ్యంగా రియాలిటీ షోకి జడ్జిగా మారడంపై ఆమె చేసిన కామెంట్స్ ఇప్పుడు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. షాకింగ్‌గా అనిపించింది: ఇంటర్వ్యూలో భాగంగా "అది కొత్త ఏమీ కాదు.. జడ్జి అవ్వడం, డాన్స్ షో చేయడం మీకు ఎలా అనిపించింది?" అని ప్రశ్నించగా, అనుపమ చాలా సరదాగా స్పందించారు. "నాకు కూడా ఇదొక పెద్ద షాకే. నేను అసలు ఊహించలేదు. సడన్‌గా అలాంటి ఒక అవకాశం వచ్చింది. కొత్త విషయాలను ప్రయోగాత్మకంగా చేయడం నాకు ఇష్టం కాబట్టి వెంటనే ఓకే చెప్పాను. ఇక ఇప్పటికే సినిమాలు, షార్ట్ ఫిలిమ్స్, మ్యూజిక్ వీడియోలు చేశాను" అంటూ తన ఆశ్చర్యంతో పాటు ఎగ్జైట్‌మెంట్‌ను పంచుకున్నారు. 'ఢీ' షోలో జడ్జిగా ఎంట్రీ: తెలుగు ప్రేక్షకులను అలరిస్తున్న 'ఢీ' డ్యాన్స్ షోకు అనుపమ పరమేశ్వరన్, జానీ మాస్టర్ జడ్జ్‌లుగా వ్యవహరిస్తున్నారు. సినిమాల్లో గ్లామర్, యాక్టింగ్‌తో అలరించే అనుపమ, తొలిసారి ఒక డ్యాన్స్ రియాలిటీ షోకి జడ్జిగా ఎంట్రీ ఇవ్వడం ఆమె కెరీర్‌లో మరో విశేషంగా నిలిచింది. పల్లెటూరి నేపథ్యంలో 'క్రేజీ కల్యాణం': ఇదిలా ఉంటే, అక్టోబర్ 16న విడుదల కానున్న 'క్రేజీ కల్యాణం' సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. బద్రప్ప గాజుల దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో తరుణ్ భాస్కర్, అనుపమ పరమేశ్వరన్, అఖిల్ రాజ్ ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఇక తెలంగాణ గ్రామీణ నేపథ్యం, బంధువుల గొడవలు, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా సాగే ఈ సినిమా ట్రైలర్ ఇటీవల విడుదలై యూట్యూబ్‌లో దూసుకుపోతోంది.

# పవన్ కల్యాణ్ తొలి సినిమాకు 30 ఏళ్లు..

## అల్లు అరవింద్ స్పెషల్ నోట్

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ సినీ పరిశ్రమలో 30 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రత్యేక లేఖను విడుదల చేశారు. పవన్ కల్యాణ్ సినీ ప్రస్థానం, ఆయన సామాజిక దృక్పథాన్ని ప్రశంసిస్తూ రాసిన ఈ లేఖ ప్రస్తుతం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.

"ప్రియమైన శ్రీ పవన్ కల్యాణ్ గారికి, మన ఇద్దరి కలయికలో వచ్చిన మొదటి సినిమా విడుదలై 30 సంవత్సరాలు పూర్తయిందని తెలిసి ఆశ్చర్యానికి, దాదాపు షాక్‌కు గురయ్యాను. ఈ పరిశ్రమలో మీరు అద్భుతమైన ప్రయాణాన్ని సాగించారు. 30 ఏళ్లు పూర్తి చేసుకున్న మీకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు" అని అల్లు అరవింద్ తన లేఖలో పేర్కొన్నారు.

పవన్ కల్యాణ్ భవిష్యత్తును ఉద్దేశిస్తూ, "మీరు ఎంచుకున్న మార్గంలో మరిన్ని సంవత్సరాలు విజయం సాధించి, సంతృప్తికరమైన జీవితం గడపాలని నేను ఆకాంక్షిస్తున్నాను. అన్నింటికంటే ముఖ్యంగా, సినిమాలకు అతీతంగా సమాజం పట్ల మీకున్న విస్తృత దృష్టిని, మీరు చేస్తున్న సేవను నేను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను" అని కొనియాడారు. చివరగా, "డియర్ కల్యాణ్, మరోసారి అభినందనలు. నా శుభాకాంక్షలు, ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయి" అని అల్లు అరవింద్ తన లేఖను ముగించారు.

పవన్ కల్యాణ్ కథానాయకుడిగా పరిచయమైన "అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి" చిత్రానికి అల్లు అరవింద్ నిర్మాతగా వ్యవహరించిన విషయం తెలిసిందే. మూడు దశాబ్దాల క్రితం ప్రారంభమైన వారి ప్రొఫెషనల్ బంధాన్ని గుర్తుచేసుకుంటూ, నేడు పవన్ కల్యాణ్ ఒక నటుడిగానే కాకుండా ఉప ముఖ్యమంత్రిగా ప్రజాసేవలో ఉన్న తరుణంలో అల్లు అరవింద్ ఈ లేఖ రాయడం ప్రాధాన్యత సంతరించుకుంది.పవన్ కల్యాణ్, సుప్రియ యార్లగడ్డ జంటగా ఈవీవీ సత్యనారాయణ దర్శకత్వంలో వచ్చిన 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' చిత్రం 1996 అక్టోబరు 11న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ తొలి చిత్రంలో పవన్ నటనకు మంచి మార్కులే పడ్డాయి.







# 'కాస్ట్' టీజర్ విడుదల

వరుణ్ సందేశ్, గగన్ బాబు , సత్యం రాజేశ్, రవి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సోషల్ డ్రామా 'కాస్ట్'. ఏకే జంపన్న రచన, దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని గోల్డెన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై తోట లక్ష్మీ కోటేశ్వరరావు నిర్మిస్తున్నారు. కశిక కపూర్, దివి వద్యా కథానాయికలుగా నటిస్తున్నారు. తాజాగా ఇంటెన్స్ అండ్ గ్రిప్పింగ్ టీజర్‌ను లాంచ్ చేశారు టీజర్ లాంచ్ ఈవెంట్‌లో డైరెక్టర్ శివ నిర్వాణ మాట్లాడుతూ ఈ సినిమాతో జంపన్నకు చాలా మంచి పేరు రావాలని, మరిన్ని సక్సెస్‌ఫుల్ సినిమాలు చేయాలని కోరుకుంటున్నానని తెలిపారు.ప్రొడ్యూసర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ 'మా హీరోలు వరుణ్ సందేశ్, గగన్, రవితో పాటు మా టెక్నీషియన్లందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. అనూప్ రూబెన్స్ అద్భుతమైన మ్యూజిక్ చేశారు. త్వరలోనే పాటలు విడుదలవుతాయి. డైరెక్టర్ ఈ సినిమాను బ్రహ్మాండంగా తీశారు' అని అన్నారు. డైరెక్టర్ ఏకే జంపన్న మాట్లాడుతూ ఈ సినిమాలో వరుణ్ సందేశ్, రాజేశ్, రవి, గగన్ అద్భుతంగా నటించారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాస్ రావు, నవీన్ ఎర్నేని, గగన్ బాబు, అనూప్ రూబెన్స్, రవి, సత్యం రాజేశ్, దివి వద్యా పాల్గొన్నారు.